ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 03, 2015

సావిత్రి... ఓ సువర్ణాధ్యాయం!

విప్లవ వీరుడు

ఏమీ జాక్సన్

సన్నీ లియోన్

టెలుగు తారలు

తెలుగమ్మాయి హీరోయిన్‌గా అంటే ఓ పెద్ద వార్తే ఈ రోజుల్లో. అరువు తారల గుంపులో అరుదైపోయింది తెలుగు అందం. పోనీలే పొరుగు భామలతో దేశీ పోలికలైనా పోగవుతున్నాయని సంతృప్తి పడేలోపు రింగ.. రింగ.. అంటూ ఫారెన్ ఆండ్రియానా స్వాజోరింగాలు కబ్జా చేసేస్తున్నారు తెలుగు తెరను. పోనీలే ఐటెం సాంగుల్లో మనోళ్లెందుకులే అని మళ్లీ వెనకేసుకొస్తే పాశ్చాత భామలేమో పాత్రల్లో ఒదిగి హీరోయిన్లుగా ఎదిగి వెంటపడుతున్నారు. పరదేశి లాంటి సినిమాల్లో తళుక్కుమన్న ఫారెన్ నటులు ఈ మధ్య ఎక్కువగా వెండి తెరలో నిండిపోతున్నారు. తీన్‌మార్ నుంచి ఈ ట్రెండ్ బాగా పెరిగిపోయి త్వరలో విడుదలవబోతున్న 'రుద్రమదేవి'కి పాకింది. బ్రెజిల్ దేశపు వన్నెలాడి నటాలియా కౌర్ 'దళం' లో చేరి రుద్రమదేవిలో పాత్రను కైవసం చేసుకుంది. దేవుడు చేసిన మనుషులు సినిమాతో డిస్టర్బ్ చేసిన బ్రెజిల్ మోడల్ గేబ్రియేలా బెర్టాంటేతో మొదలైన అలజడి సన్నీలియోన్ 'కరెంటు తీగ'తో తెలుగు ప్రేక్షకులకు షాక్ తగిలించడంతో ఆగిపోలేదు. కేవలం ప్రత్యేక పాత్రలకే పరిమితమవకుండా హీరోయిన్లగానే చాన్స్‌లు కొట్టేసిన అమ్మళ్లు ఉన్నారు. చంద్ర సిద్ధార్థ 'ఏమో గుర్రం ఎగరావచ్చు'లో హీరోయిన్‌గా థాయ్ సుందరి పింకీ సావిక వాలిపోయింది. మరో థాయ్ అందం 'లవ్ బూమ్' హీరోయిన్ చాట్చా పాటుంథిప్‌ను వెంటేసుకొచ్చింది. ఆ మధ్య ఎస్వీ కృష్ణారెడ్డి కొడుకును పరిచయం చేస్తూ తీసిన 'యమలీల 2'లోను నికితా డియా అనే దక్షిణాఫ్రికా చిన్నదాన్ని హీరోయిన్ చేశారు. సెలవులకు వచ్చి ముంబై వీధుల్ని చుడుతున్న ఈ అమ్మాయిని చూసి సినిమా ఆఫర్ ఇచ్చేశారట. అంత దూరం నుంచి వచ్చిన పిల్లే చేయగలిగింది, ఇక్కడకొచ్చిన నేనేం తక్కువ అంటూ ఆస్ట్రేలియా సుందరి క్రిస్టినా అఖీవా 'గాలి పటం'నకు దారం కట్టేసింది. కటేరా హకీమి అనే ఆఫ్ఘన్ అమెరికన్ భామ 'వూమనియా' అనే చిత్రంలో నటిస్తోంది. అది తెలుగు చిత్రమే. అయితే వీళ్లంతా ఒక ఎత్తు అమీ జాక్సన్ ఒక ఎత్తు అని చెప్పుకోవచ్చు. తెలుగులో అనువాదమైన మద్రాసు పట్టణం తమిళ చిత్రం ద్వారా పరిచయమైన అమీ జాక్సన్ 'ఎవడు'లో పాత్రను దక్కించుకుంది. ఏకంగా శంకర్ హీరోయిన్ 'ఐ' అందర్నీ ఆశ్చర్యపర్చింది. బ్రిటన్‌కు చెందిన అమీ అలా వచ్చి ఇలా జాక్‌పాట్ కొట్టేసింది. టాలీవుడ్ ట్రెండ్ చూస్తుంటే నెలకో కొత్త పరదేశి ముఖాన్ని తెరపరిచయం చేయడంలో తలమునకలైనట్టు అనిపిస్తోంది. ఇప్పుడు టెలుగు తారలతో టాలీవుడ్ టిన్సెల్ టౌన్ మెరిసిపోతోంది.

●

శవికా

చాచా

కౌర్

క్రిస్టినా

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పరార్...

ఇదో అరుదైన మాట. ఎప్పుడో తప్ప వినిపించదు. కనిపించదు. ఒకవేళ వినిపించినా...కనిపించినా విపరీతమైన ఉత్సుకతను రేకెత్తించే సత్తా వుందీ పదంలో. ఎవరు... ఎందుకు... ఎలా... ఎప్పుడు... ఎక్కడ పరారీ అయ్యిందీ పూర్తి వివరాలు తెలుసుకునే వరకూ ప్రాణం వూరుకుంటే ఒట్టు.

పత్రికల్లో 'ఖైదీలు పరారీ' అని కనిపిస్తే చాలు! తతిమ్మా వార్తలన్నీ వదిలేసి.... ఆ సింగిల్ కాలమ్ న్యూసును ఆసాంతం ఆసక్తిగా చదివేస్తుంటారు పాఠక మహాశయులు. రోజంతా ఊచలు లెక్కించలేకో... కఠిన శిక్షను భరించలేకో... ఆలవాటు పడిన నేరాలకు దూరంగా వుండలేకో... జైళ్ల నుంచి జంపవుతుంటారు ఖైదీలు. ఆ వెనకే పోలీసులు రంగంలోకి దిగుతుంటారు... వారిని తిరిగి బంధించడానికి.

జైళ్ల తర్వాత పరారీ వార్తలు వచ్చేది ఆసుపత్రుల నుంచే. కఠినాతి కఠినంగా వుండే ఆహార తదితర నియమాలను పాటించలేక... ఇష్టంలేని మందులు మింగలేక... రోగాల మధ్య గడపలేక... చెప్పా పెట్టకుండా చెక్కేస్తుంటారు పేషెంట్లు. వీరిని వెతికి తిరిగి ఆస్పత్రికి చేర్చే బాధ్యత యాజమాన్యానిదే కనక వారాపనిలో పడతారు.

ఈ రెండు ప్రదేశాలను మినహాయిస్తే పారిపోయేది స్కూళ్ల నుంచి... హాస్టళ్ల నుంచే. ఇష్టం లేని, మోయలేని చదువుల బరువులు దించుకోడానికి పసి మనసులకు తెలిసిన ఒకే ఒక్క మార్గమిది. ఆ దారిలో ఎన్ని ముళ్లుంటాయో తెలీని లేత హృదయాలను తిరిగి దరికి చేర్చుకుని ఓదార్చేందుకు పెద్దలు బయల్దేరతారు ఆర్తిగా.

టీనేజీ అమ్మాయిలు, అబ్బాయిలు... పరారైన వార్తలు అడపాదడపా వస్తూనే వుంటాయి. ప్రేమ, (ఇష్టంలేని) పెళ్లి, చదువు...వగైరా వగైరా కారణాలతో ఇల్లు విడుస్తుంటారు. అయితే ఈ గాథల్లో సుఖాంతాల కంటే విషాదాంతాల మోతాదే ఎక్కువ.

అయితే పెళ్లయిన కొన్ని గంటలకే... కాళ్ల పారాణి కూడా పూర్తిగా ఆరని నవ వధువు పారిపోతే! అదీ ఓ పల్లెటూళ్లో! ఎంత పెద్ద వార్తవుతుంది! అదే జరిగింది ఉత్తరప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో. అందరు అమ్మాయిల్లాగే ఆమె కూడా కోటి కోరికలతో... అంతులేని ఆశలతో అత్తవారింట అడుగెట్టింది. ఆ మరుక్షణమే తెలిసింది! ఇంట్లో మరుగుదొడ్డి లేదని! చెంబు చేత పట్టుకొని చేలల్లోకి వెళ్లాలని. అంతే! అక్కడి నుంచి పారిపోయింది. దొడ్డి కట్టించే వరకు వచ్చేదేలేదని సమాచారం పంపింది. ఆ విషయం ఊళ్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఆమెకు ముందు ఎందరో అమ్మాయిలు కోడళ్లుగా వచ్చారు. మరుగుదొడ్లు లేక బాధలు పడ్డారు. ఎవ్వరూ నోరు మెదపలేదు. చిన్నదైనా ఆమె ప్రదర్శించిన తెగువ అందర్నీ ఆకట్టుకోవడం...సమస్య పరిష్కారం కావడం జరిగిపోయింది.

ఓ మంచి పని కోసం...కుర్ర కోడలు ఎంచుకున్న మార్గం మొదట ఆక్షేపణలకు గురైనా...తర్వాత అందరి మన్ననలు పొందింది. లక్ష్యాన్ని బట్టి సాధనం మెప్పు పొందుతుంది కదా మరి. ■

◆ మనలో మాట

టపా

మర్చిపోలేం

అనార్కలి సినిమా ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. ప్రేమ కథే కాని అందులో నటీనటులను తీర్చిదిద్దిన ఘనత దర్శక నిర్మాతలదే. అక్కినేని, అంజలీదేవిని ఎంపిక చేసి కథను నడిపేది వారేనని ప్రేక్షకులు మర్చిపోలేరు. ఇక సంగీతం ఇప్పటికీ మంత్ర ముగ్ధులను చేస్తుంది. అన్ని వర్గాల వారు ఆస్వాదించిన సినిమా ఇది. సాహసయాత్ర చేయాలనుకుంటే ధైర్యం చేయాలి. అందుకు ఓ చిన్న కుటుంబం, ఒక కారు వున్నా సరిపోతుంది. సెలవులకు పిల్లల్తో పర్యటించి వస్తే అది ఒక ఆనందం. ఖరీదైన షికారు చదివాం. అందరి కంటే భిన్నంగా ఉండాలనుకుంటారు కొందరు. అందుకనుగుణంగా వారి ప్రత్యేకతని నిరూపించుకుంటారు.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారిపేట, ఆముదాల వలస.

కలగానే పెళ్లి

పెళ్లి కలేనా వ్యాసం బాగుంది. మారుతున్న జీవన నేపథ్యంలో పెళ్లి అనేది ఒక కలగానే మిగులుతోంది. ఆధునిక యుగంలో అందరి కన్నా ఎక్కువగా సంపాదించాలి. మనకంటూ ఒక పేరు, ప్రతిష్ట కోసం నిరంతరం పాకులాడుతూ ఉంటారు. ఈ బిజీ లైఫ్‌లో పెళ్లి జోలికి వెళ్లకపోవడమే మంచిదని భావిస్తారు. అది సరిగాదని బాగా చెప్పారు. మన సమాజంలో కూడా మహిళలు క్రీడల్లో రాణిస్తారనడానికి చక్కటి ఉదాహరణ మిథాలీ రాజ్ విజయం.

అమృతవల్లి, విజయవాడ (మెయిల్)

అంత ఖరీదా!

అరబ్ దేశాల్లో డబ్బును ఎలా ఖర్చుపెట్టాలా అని చూస్తుంటారు. మన దేశంలో డబ్బులు ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తుంటారు. అభివృద్ధి చెందిన దేశం, అభివృద్ధి చెందుతున్న దేశానికి ఇది ఒక ఉదాహరణగా చూపించడం చాలా బాగుంది. వెరైటీగా కనిపించేందకు కారుకు మెరుగులు దిద్దడం ... అదీ అంత డబ్బు పోసి! అలాంటి కారులో షికారంటే ఎంత ఖర్చో కదా! అరుంధతీ గ్రామంలోని ఈ మూఢాచారం ప్రస్తుత సమాజంలో కూడా ఉందంటే నమ్మబుద్ధి కావడం లేదు. మనిషి రాకెట్టు కంటే స్పీడుగా అభివృద్ధి చెందుతుంటే వీరు మూఢ నమ్మకాలు, విశ్వాసం పేరుతో మరో 100 ఏళ్లు వెనక్కి నెడుతున్నారు.

టి.జగదీష్, హైదరాబాద్.

తెలియని విషయాలు

తెలుసాలో చెప్తున్న విషయాలు చదువుతుంటే... నమ్మబుద్ధి కావడం లేదు. 'నిజమా' అనిపిస్తోంది. వీటి ద్వారా మనకు తెలియని విషయాలు కూడా నేర్చుకుంటాం. అనార్కలి సినిమా బాగుంది. ఆనాటి మధుర స్మృతులను మరోసారి నెమరువేసుకున్నాం.

సంపత్ కుమార్, కంకటపాలెం.

పెళ్లి ప్రాధాన్యత

యువత పెళ్లికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. పెళ్లి అయిన తరువాత కూడా కాపురానికి ఇష్టపడడం లేదు. విడివిడిగా స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటున్నారు. కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. పెళ్లికి ముందు కలిసి తిరగడానికే యువతీయువకులు ఎక్కువ ఇష్టపడుతున్నారు. మనిషి జీవితం ఒక యాంత్రికం, ఈ యాంత్రీకరణలో విలాసాలకు అలవాటుపడని మనిషి ఎవరన్నా ఉంటారా? సరైన సమయంలో అట్టమీద కథ ఇచ్చారు.

టి.శ్రీరామ మూర్తి, గాజువాక, విశాఖ.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

విప్లవ వీరుడు

కవర్‌స్టోరీ 14

అమాయకులూ అసహాయులైన అడవి బిడ్డలనే సైన్యంగా సమీకరించి.. ఆంగ్లేయ ప్రభుత్వాన్ని ధిక్కరించి..ఉత్తేజ ప్రదాతగా శాశ్వతంగా నిలిచిపోయిన తెలుగు విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు. సమరశీలతలో, సాహసంలో తన కాలం కన్నా ముందున్న వాడు.. అహింసా జపాన్ని అధిగమించి ఆయుధాలు చేబూని మన్య విప్లవం రగిలించిన వాడు అల్లూరి.. భారతీయులకు నాగరికత నేర్పామని గొప్పలు పోయే తెల్ల దొరల అమానుషానికి బలైన అమరజ్యోతి.. ఆదివాసులను అడవులూ కొండలూ గనులూ కార్పొరేట్లకు కట్టబెడుతున్న నేటి సరళీకరణ యుగంలో ఆయన అడుగుజాడలు అనుసరణీయాలు.. స్మరణీయాలు..

ఆదర్శ గ్రామం 3
మద్యానికి చెక్ మేట్

నవ్వుల్-పువ్వుల్ 4

వింతలోకం 5
దుమ్ము చిత్రాలు

ప్రత్యేకం 6
ఓ వీధి కుక్క సాహస యాత్ర!

రుచి 7
నువ్వుల వడియాలు

స్ఫూర్తి 8
సైకిల్ ఎన్ని పనులు చేస్తుందో !

యువ 9
మెకానిక్ కొడుకు ఎం.ఐ.టి సీటు కొట్టాడు

సినిమా కబుర్లు 10
సావిత్రి...ఓ సువర్ణాధ్యాయం

కథ 18
కదలిక

బాలనేస్తాలు 22
బొమ్మల డాక్టర్

కొత్త పుస్తకాలు 24
అరచేతిలో అద్భుత ప్రపంచం

టెకీ రైతులు



.... 12

‘64 గళ్ల’లో ఆ ఊరు ఇమిడిపోయింది. చదరంగాన్నే ఓ ఎత్తుగా వేసిన పావు పారింది. మద్యం పారే చోటు తీరు మారింది. అదే కేరళలోని త్రిస్సూరు సమీప గ్రామం మరోటిక్కల్. ఒకప్పుడు మత్తులో జోగిన ఊరంతా ఇప్పుడు చదరంగంలో మునిగి తేలుతోంది. సారాయి తయారీలో చకచకా కదిలిన చేతులు ఇపుడు నింపాదిగా పావుల్ని కదుపుతున్నాయి.

మద్యానికి చెక్‌మేట్

ప్రకృతి రమణీయతకు మారు పేరైన కేరళలోని మరోటిక్కల్‌లోను అందమైన జలపాతాలున్నాయి. ఒలక్కాయమ్, ఇలం జిప్పరా జలపా తాలను సందర్శించేందుకు ఎక్కడెక్కడి వారో వస్తారు. కానీ, అక్కడి వారికి మాత్రం ప్రకృతిలోని అందం అలవాటై పోయింది. వాళ్లకు సారా ప్రవాహమే మనోహరంగా అనిపించేది. జలపాతాలతో పాటు మద్యమూ పారేది. 1970 ప్రాంతంలో ఆ ఊరికి సారాయి తయారీ కేంద్రంగా చెడ్డ పేరు ఉండేది. కేవలం తయారీనే కాదు, ఆ ఊరి ప్రజలు కూడా సారాయికి బానిసలయ్యారు.

గ్రామం మొత్తం మత్తులో మునిగి పోయేది. పోలీసులు ఎన్ని సార్లు రైడ్‌లు చేసినా, ఎన్ని కౌన్సిలింగులు ఇచ్చినా అక్కడి ప్రజల తీరు మారేది కాదు. మద్యం తయారీకి అడ్డుతగిలినా, అప్పటికే మద్యానికి దాసులైన వారిని ఎలా విముక్తి చేయాలో అర్థంకాలేదు. ఒక్కరితో మద్యం మాన్పించడమే చాలా కష్టమనుకుంటే ఊరి ఊరంతా ఎలా బాగు పడేది.

చద‘రంగం’ సిద్ధమైంది

అదే గ్రామానికి చెందిన ఉన్నికృష్ణన్ అప్పట్లో చిన్నపిల్లాడు. ఇంకా మద్య ప్రవేశం అవకుండానే ఆ ఊరి అలవాటు నుంచి బయటపడ్డాడు. చదువు కోసం పక్కూరు తాలోర్‌కు వెళ్లేవాడు. అక్కడ నారాయణ మాస్టర్ అనే చదరంగపు గురువు గారు తన ఇంట్లోనే శిక్షణనిచ్చేవారు. ఓ సారి ఉన్ని కృష్ణన్, 16 ఏళ్లకే గ్రాండ్ మాస్టరైన అమెరికా మేటి చదరంగ క్రీడాకారుడు బాబీ ఫిచర్ గురించి విన్నాడు. ఆయన స్ఫూర్తిగా, చెస్ నేర్చుకోవడం మొదలు పెట్టాడు. అతనికి సమయం తెలిసేది కాదు. ఎంత సేపు ఆడినా బోరు కొట్టకపోగా, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మైమరిపించేలా గమ్మత్తుగా ఉండేది ఆ ఆట. తనకు లాగే చెస్ ప్రియులందరికీ ఉంటుందని తెలుసుకుని తన ఊరికి పట్టిన మద్యం మత్తు వదలాలంటే ఇదే సరైన మందు అని గ్రహించాడు.

నిదానంగా ఒక్కొక్కరికీ చదరంగాన్ని అలవాటు చేశాడు. చెస్‌లో ఉన్న మజా మద్యమూ ఇవ్వలేదని తెలుసుకున్న వాళ్లు ఒక్కొక్కరూ చెస్‌ను ఆశ్రయించారు. వేడిలో వేడి అన్నట్టు... కొందరు పోలీసులకు ఉప్పందించి సారాయి బట్టీలను ధ్వంసం చేయించారు. ఇలా నెల రోజుల పాటు ఆగకుండా జరిగిన పోలీసు రైడ్లతో మద్యం బట్టీలు ధ్వంసమయ్యాయి. తాగుడుకు బానిసలైనవారికి వెంటనే ఏదో ఒక ప్రత్యామ్నాయం కావాలి. అది చదరంగమైంది. అంతే ఊరిలో ప్రతి ఒక్కరూ చెస్‌ను నేర్చుకుని ఎత్తులు, పై ఎత్తుల్లోని కిక్కును ఆస్వాదించసాగారు. సారాయిని మొత్తంగా వదిలేసి చదరంగం పావులు సర్దుకున్నారు. మద్యం అలవాటుకు చెస్ చెక్ పెట్టేసింది.

100% లవ్

ఇప్పుడు ఆ ఊరిలో చెస్ రానివారంటూ ఎవరూ లేరు. నిరక్షరాస్యులు, కూలీ పనులు చేసేవారున్నా 100 శాతం చెస్ లిటరసీని సాధించి ఆ ఊరు ప్రపంచం దృష్టిలో పడింది. దేశంలోనే తొలి చెస్ గ్రామంగా గుర్తింపు పొందింది. ఖాళీ సమయాల్లో అక్కడ ఏ వీధికెళ్లినా, ఏ అరుగు చూసినా చిన్నాపెద్దా తేడా లేకుండా చెస్ ఆడుతూ కనిపిస్తారు. ఇలా ఊరంతా చెస్‌తో 100% లవ్‌లో పడిపోయింది. ఊరిలో చదరంగానికి బీజం వేసిన ఉన్నికృష్ణన్ నలభై ఏళ్లుగా సుమారు 600 మంది గ్రామస్తులకు చెస్ నేర్పించాడు. ఆయన ఇల్లు, హోటల్ కూడా చెస్ కదలికలకు వేదికైపోయాయి. గుడి, బడి ప్రతి జాగా కూడా చెస్ వేదికలయ్యాయి. గ్రామంలో వచ్చిన మార్పుకు అధికారులు కూడా ముగ్ధులయ్యారు. ప్రత్యేక క్యాంపులు, తరగతులను ఏర్పాటు చేసి గ్రామస్తులను ఉత్తేజపరిచారు. గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ కూడా ఈ విషయం తెలుసుకుని గ్రామస్తులకు అభినందనలు తెలిపాడు. పక్క గ్రామాలకే కాక ఎన్నో ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచిన ఈ ఊరి కథ ఓ సినిమాకు ప్రేరణైంది. కథ భిన్నమైందైనా ఆ ఊరిలో భాగమైన చదరంగాన్నే ముఖ్యపాత్రగా చేసుకున్న ‘ఆగస్టు క్లబ్’ అనే చిత్రాన్ని రూపొందించారు మళయాలీ దర్శకుడు కె.బి. వేణు. ఇప్పుడా ఊరు మేధావులకు స్థానమైంది. చదరంగం ద్వారా అబ్బిన తెలివి సంపాదనకు కూడా బాగానే పనికొచ్చింది. మద్యాన్ని వదిలేసి చెస్‌ను సొంతం చేసుకున్న ఆ ఊరు... సరైన కాలక్షేపాన్ని ఎంచుకుంటే ఎంత మంచి మార్పు వస్తుందనే దానికి ఆ ఊరి కథే సజీవ సాక్ష్యం.

✦

నవ్వుల్ – పువ్వుల్



ఉత్తరాలు

కస్టమర్: కేవలం ఉత్తరాలు రాస్తూ బతుకుతున్నావా? ఇంతకీ ఏ మ్యాగజైన్సుకు రాస్తుంటావు?

స్వాతి: అవును. డబ్బు పంపమని మా నాన్నకు రాస్తుంటాను.

వెయ్యి మార్గాలు

'సార్! ధర్మం చేయండి సార్....'

'పోవయ్యా అడుక్కోవడానికి సిగ్గులేదా?'

'అలా తీసిపారేయకండి సార్..'

'నేనొక రచయితని. డబ్బు సంపాదించడానికి వెయ్యి మార్గాలు అనే పుస్తకం రాసిందినేనే.. నిజమా.....!'

'మరి అడుక్కుంటున్నావెందుకు...?'

'ఆ వెయ్యి మార్గాల్లో ఇదొకటి సార్.....!'

అవమానం

(కవిత తన పిల్లాడితో బస్ ఎక్కింది)

డ్రైవర్: నా జీవితంలో ఇంత చండాలమైన పిల్లాడిని ఎక్కడా చూడలేదు

(కోపంతో ఊగిపోతూ పక్కనామెతో)

కవిత: ఆ డ్రైవర్ నన్ను అవమానించాడు.

పక్కావిడ: వెళ్ళి బుద్ధి చెప్పు. ఆ కోతి పిలను నేను పట్టుకుంటాలే.

సప్లై

కస్టమర్: ఏవండీ... మీ హోటల్లో మంచి గదులు ఉన్నాయా?

మేనేజర్: ఉన్నాయండీ

కస్టమర్: మంచి టిఫెన్, కాఫీ...?

మేనేజర్: సప్లై చేస్తాం సార్

కస్టమర్: భోజనం అదీ....

మేనేజర్: సప్లై చేస్తాం సార్..

కస్టమర్: వెరీ గుడ్... అయితే ఒక రూమివ్వండి.

అవునూ... రూమ్‌లో దోమలున్నాయా?

మేనేజర్: లేవు సార్....సప్లై చేస్తాం సార్

చదువు

(ఇద్దరు మిత్రులు తిరుమల ఘాట్లో రోడ్డు మీద నడిచి వెళ్తుంటే ఒక పులి ఎదురొచ్చింది. ఇద్దరూ వణికిపోయారు.)

రాము: భయపడకు ఆనంద్.. సడెన్‌గా పులి ఎదురొచ్చినప్పుడు చేతులు రెండు పక్కలకు జాపి దిష్ఠి బొమ్మలా కదలకుండా నిలుచుంటే పులి ఏమీ చేయదని మొన్న ఒక పత్రికలో చదివాను.

ఆనంద్: నువ్వు చదివావు సరే. మరి ఆ పులి ఆ పత్రిక చదివిందా.

లేడీస్ సీట్

లేడీస్ సీట్లో కూర్చున్న రాము, రాధ రాగానే లేచి సీటు ఇవ్వబోయాడు)

రాధ: ఫర్వాలేదు కూర్చోండి. నేను నిలబడతాను

(మళ్ళీ ఇంకో స్టాప్ రాగానే రాము లేవబోగా..)

రాధ: వద్దొద్దు కూర్చోండి

రాము: (ఇంకో స్టేజి రాగానే) మేడమ్..దయచేసి నన్ను వెళ్లనివ్వండి. ఇప్పటికే నేను దిగాల్సిన స్టేజి దాటి చాలా దూరం వచ్చేశాను.

ఇంటివాడు

(చిలక జోస్యం చెప్పినవాడి మీద మండిపోతున్నాడు జగన్నాథం)

జగన్నాథం: ఏం జ్యోతిష్యమండీ! త్వరలో నేనొక ఇంటివాడినౌతానన్నారు. సంవత్సరం తిరిగినా పెళ్ళి కాలేదు సరి కదా అప్పులెక్కువై ఉన్న రెండు ఇళ్ళలో ఒక ఇల్లు అమ్మి వేయాల్సి వచ్చింది.

జ్యోతిష్కుడు: మరింకేమండి! ఇప్పుడు మీరు ఒక్క ఇంటివారే అయ్యారు కదా! నా జ్యోతిష్యాన్ని తిడతారేం?

దుమ్ము చిత్రాలు

కారు అద్దానికి దుమ్ము పడితే చక్కగా తుడిచి తళతళలాడిస్తాం. కానీ, టెక్సాస్‌కు చెందిన స్కాట్ వేడ్ మాత్రం మరింత దుమ్మును పోసి ఆలోచిస్తుంటాడు. ఈయనకు పిచ్చా అనుకుంటుండగానే ఆ దుమ్మును చిత్రంగా మలచి పిచ్చోళ్లను చేస్తాడు. గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేసే స్కాట్ వేడ్ ఓ రోజు 'వాష్ మీ' (నన్ను శుభ్రం చేయు) అని దుమ్మును చెరిపి వేలితో రాసున్న ఓ కారును చూశాడు. దుమ్ముతో అలా రాయడం ఆయనకు భలే నచ్చింది. తర్వాత తన కారు దుమ్మును తుడిచేప్పుడు ఈ విషయం గుర్తొచ్చింది. దుమ్మును చెరిపి రాయగా లేంది, బొమ్మ గీయలేమా? అనుకున్నాడట. వెంటనే చిన్న బ్రష్, గొట్టం తీసుకుని జాగ్రత్తగా చేతి వేళ్లను ఉపయోగించి దుమ్మును చిత్రంగా మలిచాడు. అదీ చాలా బాగా రావడంతో, కార్ల అద్దాలపై ఈయనే దుమ్ము చల్లి బొమ్మలు వేయడం మొదలు పెట్టాడు. వీటిని చూసిన కారు ఓనర్లకు కోపం రాకపోగా ముచ్చటపడి ఫొటోలు తీసుకున్నారు. ఈ కార్లు రోడ్లపై తిరుగుతుంటే ట్రాఫిక్ జామ్‌లు కూడా అయ్యాయట. అంత క్రేజ్ వచ్చేసింది స్కాట్ ఆర్ట్‌కు. మోనాలిసా నుంచి తన పెంపుడు కుక్క వరకు ఎన్నో దుమ్ము బొమ్మల్ని గీసేశాడు. అయ్యో! గాలికో, వానకో ఊరికే తుడుచుపెట్టుకుపోతాయి కదా, అంత కష్టం వృధా కదా అంటే కానీయండి మరో బొమ్మ గీసే చాన్సొస్తుంది అని నవ్వుతాడు స్కాట్.

యుద్ధ ట్యాక్సీ..

ఈ ట్యాక్సీలో గుండె మీద చేయేసుకుని ప్రయాణించొచ్చు. ప్రమాదమనే తలంపే లేకుండా నిశ్చింతగా తిరగొచ్చు. ఎందుకంటే ఇది ట్యాక్సీగా మార్చబడిన పాత యుద్ధవాహనం. ప్రపంచంలోనే అతి సురక్షితమైన ట్యాక్సీగా పేరుపొందిన ఈ వాహనం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ వీధుల్లో ప్రయాణీకుల్ని తిప్పుతుంది. బిఆర్‌డీఎం 2 కంబాట్ కమాండ్ అండ్ రీకనైషన్స్ రకానికి చెందిన ఈ వాహనాన్ని 1963 నుంచి 89 మధ్య సైన్యం వాడింది. దీనిని కొనుగోలు చేసిన వ్యక్తి దాని ఆయుధ సామగ్రిని తీసేసి, రంగు మార్చి ట్యాక్సీగా తిప్పుతున్నాడు. మొదట్లో దీనికి ఒప్పుకోని స్థానిక అధికారులు తర్వాత ప్రజల నుంచి వచ్చిన విన్నపాలతో కొన్ని రూట్లలో తిప్పేందుకు తలూపారు. నీళ్ల లోను నడిచే ఈ వాహనంలో ట్రిప్పు వేయా లంటే, సుమారు ఆరు వేల రూపాయలు చెల్లించాలి.

ముక్కా దేవుడండీ!

అమెరికాలో కొందరు నాస్తికులు 'బేకన్' అనే మాంసపు ముక్కను దేవుణ్ని చేసేశారు. దేవుని ఉనికిని ప్రశ్నిస్తూ ఈ కొత్త దేవుణ్ని తెరపైకి తెచ్చారు. లాస్ వెగాస్‌కు చెందిన మాజీ సైనికాధికారి జాన్ వైట్‌సైడ్ దీన్ని తెగ ప్రచారం చేసేస్తున్నాడు. మా దేవుడి ఉనికి స్పష్టంగా కనిపిస్తోందని ఇంతకన్నా ఏం కావాలని ఎదురు ప్రశ్నిస్తున్నాడు విమర్శించేవారిని. వివిధ మతాల్లో దేవుడి రూపాలుగా ప్రచారం చేస్తున్న తిండి ఐటెమ్స్‌ను వెయిటర్ చదివినట్టు టకటకా చదివేస్తున్నాడు. అతీత శక్తులను ఖండనగా, నాస్తికుల మీద దాడులకు వ్యతిరేకంగా, హేతువాదానికి ప్రచారంగా వ్యంగ్యంగా ఈ పనిచేశాడు. బేకన్‌కు మందిరాన్ని కట్టేసి, సభ్యులను అదే... భక్తులను చేర్చుకుంటున్నాడు. ఇప్పటికే నాలుగు వేల మంది మాంసాహార ప్రేమికులు ఈ కొత్త మతంలో కలిశారట. అయితే, విపరీతమైన నమ్మకాలు, వింత ఆచారాలు ఉండవని వివరించాడు. సరదాగా ఉండాలి, హేతువాదులై ఉండాలి, ప్రభుత్వ పన్నుల్ని ఎగ్గొట్టొద్దు వంటి 9 సూత్రాలను మాత్రం పాటించాలి. పుట్టిన రోజుల దగ్గర నుంచి పెళ్లిళ్ల వరకు ప్రతిదీ ఇక్కడ జరుపుకోవచ్చు. కానీ, ఒక్క షరతు ఏ దేవుణ్నీ తంతులోకి తేకుండా. వీరి బ్యానర్లు, బిల్‌బోర్డులు పెద్ద దుమారాన్నే రేపు తున్నా వెనక్కు తగ్గడంలేదు బేకన్ భక్తులు.

ఓ వీధి కుక్క అత్యంత సాహసో పేతమైన అమెజాన్ రేస్‌లో భాగమైంది. అనుకోకుండా జట్టులో చేరిన ఆ కుక్క సాహస యాత్ర రేస్ ప్రేమికుల హృదయాల్ని కదిలించింది. ప్రాణ బంధంలా మారి జట్టు సభ్యుల హృదయాల్ని గెలుచుకుంది. 'వార్ హార్స్' కథలోని గుర్రంలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొని మరీ తన మాస్టర్ చెంత చేరింది. దీని సాహస యాత్ర గురించి తెలిసినవారు విశేష ప్రచారం కల్పించారు.

◆ ప్రత్యేకం

ఓ వీధి కుక్క సాహస యాత్ర

సుమారు 450 మైళ్ల వరకు సాగే సుదీర్ఘ సాహస యాత్ర అయిన అమెజాన్ రేస్‌లో దట్టమైన అడవుల వెంట సాగే ట్రెకింగ్, అమెజాన్ నదిలో ప్రమాదకరమైన కయాకింగ్ లాంటి ఒళ్లు గగుర్పొడిచే క్రీడా అంకాలుంటాయి. దీనిలో పాల్గొనేందుకు అంతర్జాతీయ స్థాయి డేర్ డెవిల్స్ జట్లుగా వస్తారు. అలానే స్వీడన్ నుంచి మైకేల్ లిండార్డ్ నేతృత్వంలోని జట్టు పాల్గొంది. యాత్ర మధ్యలో ఈక్వెడార్ వర్షారణ్యంలోకి ప్రవేశించిన మైకేల్ జట్టు రాత్రి విడిది కోసం ఓ చోట ఆగింది. ఆకలి మంట చల్లార్చుకునేందుకు ఆహారాన్ని తీస్తుండగా, పక్కన ఉన్న పొదల్లోంచి మూలుగు వినిపించింది. ఏమిటా అని చూసిన మైకేల్‌కు ఓ కుక్క కనిపించింది. గాయంతో బాధ పడుతున్న దాన్ని చూసి చలించిపోయిన ఆర్థర్ దానికి తాము తింటున్న ఆహారంలో ఓ భాగం పెట్టాడు. గాయాన్ని కడిగి మందు వేశారు మిత్రులు. తర్వాత నిద్రలోకి జారుకున్నారు.

యాత్రలో మలుపు.. ఆర్థర్‌గా పిలుపు

పొద్దున్నే రేసు కొనసాగించేందుకు సిద్ధపడుతుండగా ఆ కుక్క కూడా వెంట నడిచింది. కాస్త దూరం సరదాగా వస్తుందిలే అనుకోగా అది మైళ్లకు మైళ్లు వారితో కలిసి యాత్ర మొదలెట్టింది. అతి ప్రమాదకరమైన పరిస్థితుల దృష్ట్యా వాళ్లు దానిని తరిమేసేందుకు ప్రయత్నించారు. అయినా అది వెళ్లలేదు. కన్నుగప్పి వేరే మార్గాల్లో వారిని వెంబడించింది. వారి హృదయాలను గెల్చుకుంది. ఇక చేసేదేమి లేక, దాన్ని వదిలేయలేక మైకేల్ బృందం దానికి ఆర్థర్ అని పేరు పెట్టి తమలో కలిపేసుకున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో దాన్ని ఎత్తుకుని తీసుకెళు తూ జాగ్రత్తగా సంరక్షించారు. ఓ చోట బురదలో ఆర్థర్ ఇరుక్కుపోయింది. రేసులో వెనకబడుతున్న విషయం తెలిసినా దాని కోసం చాలా సమయం వెచ్చించి కాపాడారు. గాయం కావడంతో అక్కడి నుంచి దాన్ని మోస్తూనే రేస్ కొనసాగించారు. విజయవంతంగా అడవిని దాటిన వారికి తర్వాతి సవాలు ఎదురైంది. 36 మైళ్ల మేర ఉధృతంగా ప్రవహిస్తున్న అమెజాన్ నదిలో కయాకింగ్ చేయాలి. నిర్వాహకుల సూచనతో ఆర్థర్‌ను వారికి అప్పగించి బయలుదేరారు. వీళ్లను అనుసరిస్తూ ఆర్థర్ నది ఒడ్డు వెంట పరుగు తీసింది. ఓ చోట వీళ్ల ప్రయాణం చీలిపోవడాన్ని గుర్తించి అది నదిలోకి దూకేసింది. అతి చల్లటి నీళ్లలో, గాయంతో బాధపడుతున్నా ఈదుకుంటూ వారి పడవకు చేరువైంది. దీన్ని చూసి చలించిపోయిన మైకేల్ బృందం ప్రాణాలకు తెగించి, దాన్ని నీళ్లలో నుంచి పడవలోకి లాగారు. తమ కోసం ప్రాణాల్ని కూడా లెక్కచేయని ఆర్థర్‌ను ఇక వాళ్లు వదల్లేదు. వారు బాగా వెనకబడిపోయినా ఆర్థర్‌ను జాగ్రత్తగా కాపాడుకుంటూ ఆరు రోజుల తర్వాత యాత్ర ముగించారు. నలుగురితో మొదలైన వారి సాహస యాత్ర ఐదుగురి సభ్యుల జట్టుగా ముగిసింది. నిర్వాహకులూ ఆర్థర్‌ను సభ్యుడిగా ప్రకటించారు. యాత్రలో 12 స్థానాల్లోపే నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

ఓ ఇంటిదైంది...

అంతటితో ఆర్థర్ యాత్ర ముగియలేదు. వెళ్లగానే ఆర్థర్ గాయాలకు చికిత్స చేయించి, సంరక్షణ కేంద్రానికి తరలించారు. అది, మైకేల్‌కు సంతృప్తినివ్వలేదు. ఆర్థర్ ప్రాణ స్నేహితుడిగా మారిపోవడంతో దాన్ని విడిచి స్వీడన్ వెళ్లలేకపోయాడు. ఎంత ఖర్చయినా వెంటతీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. డబ్బు కోసం పేపాల్ అకౌంట్‌ను ప్రత్యేకంగా ఆర్థర్ కోసం తెరిచి, ట్విట్టర్లో మైకేల్ జట్టు ప్రచారం చేసింది. కావాలసిన డబ్బు అందినా స్వీడన్ తెచ్చుకోవడానికి అనుమతి తప్పనిసరి. ఆర్థర్ సాహసం తాలూకు ఫొటోలతో అక్కడి ప్రభుత్వానికి వినతి పత్రం అందించారు. కొన్ని రోజుల తర్వాత, అనుమతి రావడంతో మైకేల్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విమానం స్వీడన్ చేరాక మైకేల్ కుటుంబం తమ కొత్త సభ్యుడికి స్వాగతం పలికారు. ప్రభుత్వ సంరక్షణలో మూడు నెలల క్వారంటైన్ తర్వాత ఇంటికి తీసుకెళ్లొచ్చు. అందాకా ఆర్థర్‌ను చూసేందుకు జట్టు సహచరులు సైమన్, స్టాండ్, కెరెన్‌తో పాటు కుటుంబ సభ్యులతో వీలున్నప్పుడల్లా హాజరవుతున్నాడు మైకేల్.

✦



గుమ్మడి వడియాలు

కావాల్సిన పదార్థాలు : తియ్య గుమ్మడి ముక్కలు -రెండు పెద్దవి, మినపప్పు-రెండు కప్పులు, సెనగపప్పు-రెండు కప్పులు, పచ్చి మిర్చి-ఇరవై నాలుగు, ఇంగువ-చెంచా, ఉప్పు-ఐదు చెంచాలు, ఉల్లిపాయలు-రెండు

తయారు చేసే విధానం: మినప్పప్పు, సెనగపప్పును రెండు మూడు గంటల ముందు నానబెట్టుకోవాలి. గుమ్మడి ముక్కల్ని శుభ్రంగా కడిగి చెక్కుతో సహా చిన్న చిన్న ముక్కల్లా తరగాలి. ఇప్పుడు నానిన పప్పుల్ని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అందులో పచ్చిమిర్చి, జీలకర్ర, కరివేపాకు కూడా రుబ్బుకోవాలి. చివరగా ఉల్లిపాయ, గుమ్మడి ముక్కల్ని కూడా వేసి మిక్సీ పట్టాలి. అయితే అవి మరీ మెత్తగా నలగకుండా చూసుకోవాలి. ఇందులో ఉప్పు, ఇంగువ వేసి బాగా కలిపి వడియాల్లా పెట్టుకుంటే సరిపోతుంది.

మినప వడియాలు

కావాల్సిన పదార్థాలు :

మినప పప్పు-1 కిలో, జీలకర్ర-నాలుగు టీ స్పూన్స్, పచ్చి మిరపకాయలు- 100 గ్రాములు, ఉప్పు-తగినంత.

తయారు చేసే విధానం: మినప పప్పును శుభ్రంగా కడిగి ఒక పాత్ర లో నీరు పోసి దానిలో రాత్రంతా నానబెట్టాలి. రాత్రంతా నాననిచ్చాక ఉదయమే పప్పును శుభ్రంగా కడిగి మినప్పప్పు పొట్టును వేరు చేయాలి. తరువాత పచ్చి మిరపకాయలను తొక్కి ...దాన్ని మినప పప్పు రుబ్బేటపుడు వేసి రుబ్బుకోవాలి. తరువాత జీల్లకర్ర వేసి పిండిని కలపాలి. ఇలా రుబ్బుకున్న పిండిని మంచం మీద గానీ ఆరుగు మీద కానీ గుడ్డలేదా ప్లాస్టిక్ పేపర్‌పై చిన్న చిన్న వడియాలు పెట్టుకోవాలి. ఇలా పెట్టుకున్న వడియాలను రెండు మూడు రోజులు ఎండలో ఎండనిచ్చిన తర్వాత గుడ్డ లేదా ప్లాస్టిక్ పేపర్ నుండి వేరు చేసి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ వడియాలను తగినంత నూనె లేదా నెయ్యిలో వేయించుకుని తింటే ఆ రుచే వేరు.



పెసర వడియాలు

కావాల్సిన పదార్థాలు : పెసర పప్పు-1కిలో, పచ్చి మిరపకాయలు-50 గ్రాములు, ఉల్లిపాయలు-100 గ్రాములు, అల్లం-చిన్న ముక్క, ఉప్పు-తగినంత.

తయారు చేసే విధానం: ముందుగా పెసరపప్పును పాత్రలో నానబెట్టాలి. తర్వాత పెసర పప్పు పొట్టు తీసి... అల్లం, ఉల్లి, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఇలా రుబ్బుకున్న పిండిని ప్లాస్టిక్ పేపర్ మీద చిన్న వడియాలు పెట్టుకోవాలి. ఈ పిండి అంతా ఒకేసారి కాకుండా వాయిలు వాయిలుగా రుబ్బుకోవాలి. ఎందుకంటే పెసరపిండి త్వరగా విరిగిపోతుంది. ఇలా పెట్టుకున్న వడియాలను రెండు మూడు రోజుల ఎండనిచ్చి ఆ తరువాత వలచి వేసి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ వడియాలను ఉల్లిపాయలు వేసి పులుసు వండుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

నువ్వుల వడియాలు

కావాల్సిన పదార్థాలు : బియ్యప్పిండి- గ్లాసు, సగ్గుబియ్యం పొడి-కొద్దిగా, నువ్వులు-అర కప్పు, గసగసాలు-పావు కప్పు, నూనె-రెండు చెంచాలు, ఉప్పు-తగినంత, జీలకర్ర- ఐదు చెంచాలు, రాగిపిండి-కప్పు

తయారు చేసే విధానం:

ఓ గిన్నెలో మూడు గ్లాసుల నీళ్లు, నూనె తీసుకుని పొయ్యి మీద పెట్టాలి. ఈ నీళ్ల మరిగేలోపే మరో గిన్నెలో బియ్యపు పిండి, సగ్గుబియ్యం పిండి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. నీళ్ల మరిగాక బియ్యప్పిండి మిశ్రమాన్ని అందులో వేసి మంట తగ్గించి ఉండలు కట్టకుండా మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. బియ్యప్పిండి ఉడికి చిక్కటి జావలా అయ్యాక దింపేయాలి. దీన్ని గరిటెతో ప్లాస్టిక్ కాగితంపైన వడియాల్లా వేసి ఎండలో ఉంచాలి. రెండు రోజులు ఎండలో ఆరనివ్వాలి.



గ్వాటిమాలాలో సైకిల్ ఉంటే అన్నీ ఉన్నట్టే. జ్యూస్ పిండుకోవాలన్నా, నీళ్లు తోడుకోవాలనుకున్నా, మొక్కజొన్న వొలవాలన్నా, పప్పు నలగాలన్నా, లైట్ వెలగాలన్నా సైకిల్ ఉంటే సరి. కరెంట్ అవసరమే ఉండదు. బికిమకినాస్ అనే సైకిల్ ఆధారిత గృహ, వ్యవసాయ, పారిశ్రామిక యంత్రాలతో అక్కడి ప్రజల జీవన విధానమే మారిపోతోంది.

సైకిల్ ఎన్ని పనులు చేస్తుందో!

వాడేసిన సైకిళ్లకు మరికొన్ని విడి భాగాల్ని జత చేస్తూ వాటిని యంత్రాలుగా మారుస్తోంది 'మాయా పెడల్' అనే స్వచ్ఛంద సంస్థ. చాలా తక్కువ ఖర్చుతో రూపొందించి పేదలకు అందిస్తోంది. కేవలం సైకిల్ పెడల్ తొక్కడం ద్వారా పని పూర్తయ్యేలా, చాలా తేలిగ్గా వాడుకునేలా వీటిని రూపొందించి ప్రజల మన్ననలు అందుకుంటోంది. గ్రామగ్రామానికి విస్తరించి ప్రజల జీవనంలో భాగమైపోయాయి ఈ బికిమకినాస్‌లు.

కరెంట్ బిల్లులు మోత తప్పడంతో పాటు అతి తక్కువ ఖర్చుతో పనులు చేసుకోగలగడంతో అక్కడి ప్రజల ఆర్జన పెరిగింది. మంచి వ్యాయామం కూడా కావడంతో ఆరోగ్యవంతులూ అవుతున్నారు. డీజిల్, కరెంట్ వాడకం అవసరం లేకపోవడంతో వీటివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతోంది. పైపెచ్చు, ఈ వింత సైకిల్ యంత్రాలను తొక్కేందుకు పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ సరదా పడుతున్నారు. కుటీర పరిశ్రమల్లో వీటి వాడకం బాగా పెరిగిపోవడంతో వస్తూత్పత్తిలో కూడా అభివృద్ధి కనిపిస్తోంది. అయితే, ఈ బికిమకినాస్ ప్రజల జీవనంలో భాగమవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. యంత్రమంటే డీజిల్‌తోనో కరెంట్‌తోనో పని చేసేది అని స్థిరపడిపోయిన ప్రజలను వీటిని వాడేందుకు ఒప్పించడానికి చాలా ప్రయత్నమే చేయాల్సి వచ్చింది. పని చేస్తాయో లేదో, ఉపయోగించడం కష్టమేమో! అన్న భయానుమానాలతో అంతగా ఇష్టపడనివారే వాటిని ఓ సారి నడిపి చూశాక అభిప్రాయం మార్చుకున్నారు. ఇప్పుడు వీటి కోసం వారాల ముందు నుంచే బుకింగ్‌లు చేసుకుంటున్నారు.

19 రకాల యంత్రాలు

గ్వాటిమాలాలోని సాన్ ఆండ్రెస్ ఇట్జపా నుంచి పనిచేస్తోంది 'మాయా పెడల్'. 1997లో పని మొదలుపెట్టిన 'మాయా పెడల్' ఇప్పటికే ఐదు వేల వరకు ఈ సైకిల్ యంత్రాలను ప్రజలకు అందించింది. మిల్ త్రెషర్, బ్లెండర్, వాటర్ పంప్, నట్ షెల్లర్, మైక్రో కాంక్రీట్ వైబ్రేటర్, కాఫీ డీపల్పర్ వంటి 19 రకాల విభిన్న యంత్రాలను తయారు చేశారు. ఇంకా పరిశోధించి మెటల్ షార్ప్‌నర్, వాషింగ్ మెషీన్, ఎలక్ట్రిసిటీ జనరేటర్, వ్యవసాయ పరికరాలు, భారీ రంపం యంత్రాలను వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. క్యూబాకు చెందిన టెక్నాలజీ ఫర్ హెల్త్, సాంటా క్రజ్‌కు చెందిన ప్రొడెస్సా, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎగ్నెస్ట్ హంగర్ వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు స్థానిక మహిళ గ్రూపులు, స్వచ్ఛంద సంస్థలకు శిక్షణా శిబిరాలను నిర్వహించి ఎన్నో ప్రాజెక్టులను చేపట్టింది మాయా పెడల్. కేవలం ఆ దేశానికే పరిమితమవకుండా ఎవరైనా ఈ టెక్నాలజీని ఉపయోగించుకునేలా ఫ్యాక్ట్ షీట్లను తమ వెబ్‌సైట్లోను అందుబాటులో ఉంచింది. దీని సేవల్ని గుర్తిస్తూ అంతర్జాతీయ సంస్థ 'కర్రీ స్టోన్' డిజైన్ ప్రైజ్ సత్కరించింది.

పెడల్స్ ఇవే..

మాయా పెడల్‌కు ఎన్నో అంతర్జాతీయ, దేశీయ, స్థానిక స్వచ్ఛంద సంస్థలు వెన్నుదన్నుగా నిలిచాయి. మాయా పెడల్‌కు స్ఫూర్తినివ్వడంతో పాటు అవసరమైన పరికరాలను, నిపుణులను, పెట్టుబడిని అందించి ముందుకు నడిపిస్తోంది కెనడాకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'పెడల్'. కేవలం గాటిమలానే కాక అంతర్జాతీయంగా అనేక తృతీయ దేశాలకు తన సేవలను అందిస్తోందీ సంస్థ. అమెరికాకు చెందిన 'వర్కింగ్ బైక్స్', 'బైక్స్ నాట్ బాంబ్స్' సంస్థలు కూడా వాడిన సైకిళ్లను భారీ స్థాయిలో అందిస్తూ భాగం పంచుకుంటున్నాయి. సీయెర్రా క్లబ్‌కు చెందిన జీఏఐఏ ప్రాజెక్ట్, కెనడియన్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థలాంటివి నిపుణుల్ని పంపిస్తున్నాయి.



◆

మెకానిక్ కొడుకు ఎం.ఐ.టి సీటు కొట్టాడు

ఐఐటీ సీటే దుస్సాహసమనుకునే దిగువ మధ్యతరగతి నుంచి వచ్చిన ఈ కుర్రాడు ఏకంగా ఎం.ఐ.టిలోనే సీటు గెలిచాడు. అదీ కోటి రూపాయలకు పైగా స్కాలర్‌షిప్ దక్కించుకుని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. 32 మంది నోబెల్ గ్రహీతలకు చదువు చెప్పిన ఎం.ఐ.టిలో స్థానం పొంది ప్రతిభ చాటాడు మెకానిక్ కొడుకు ఆయుష్ శర్మ.

కాన్పూర్‌కు చెందిన ఆయుష్ తల్లి మంజు శర్మ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా చేసి రిటైరైంది. అతడి తండ్రి యూపీ పబ్లిక్ వర్క్స్‌లో మెకానిక్‌గా చేస్తున్నాడు. డిగ్రీ వరకు చదవని వీరు తమ పిల్లలు బాగా చదివించాలని కలలుగన్నారు. వారి అంచనాలకు తగ్గట్టుగా కేంద్రీయ విద్యాలయంలో చదువు కొనసాగించిన ఆయుష్‌కు భౌతిక శాస్త్రమంటే ఎంతో ఇష్టం. ఎంఐటీ గురించి ఏడేళ్లకే తెలుసుకున్న ఆయుష్ దానిలో చదివే అవకాశం వస్తుందని మాత్రం ఊహించలేదు. ఇంటర్ తర్వాత, ఐఐటీ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్లలో సమీకరణాలను బట్టీ పట్టించడం నచ్చని ఆయుష్‌కు ఐఐటీ పూర్వ విద్యార్థులు నడిపే 'అవంతి సంస్థ' గురించి తెలిసింది. దిగువ మధ్య తరగతి విద్యార్థులను విదేశాల్లో అవకాశాలు ఇప్పించే సదుద్దేశంతో నడుపుతున్న ఆ సంస్థ ఆయుష్ ప్రతిభను గుర్తించింది. వెంటనే 2013 బ్యాచ్‌లో చేరిపోయాడు.

ఐఐటీ దాటి ఎంఐటీ..

'అవంతి' ఎన్నో విలువైన అంశాల్ని నేర్పింది ఆయుష్‌కు. విదేశీ విద్యాసంస్థల్లో దరఖాస్తు చేయడానికి ప్రోగ్రామ్ లీడర్ అయిన టేలర్ జార్జియో రైట్ ఆయుష్ చేత రెండు వారాల యేల్ గ్లోబల్ స్కాలర్స్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేయించాడు. యేల్ విశ్వవిద్యాలయం అందించే ఈ వేసవి కోర్సులో సీటు సంపాదించాలంటే చాలానే కష్టపడాలి. ముఖ్యంగా ఇంగ్లీషు మీద మంచి పట్టుండాలి. కానీ ఇంగ్లీషులో సరిగా మాట్లాడమే రాని తనకు సీటు వస్తుందో లేదోనని ఆయుష్ సందేహించాడు. టేలర్ కూడా ఆశ్చర్యపోయేలా కోర్సుకు ఎంపిక కావడమే కాక ఐవీ లీగ్ స్కూల్ ద్వారా పూర్తి ట్యూషన్ రాయితీ కూడా లభించింది. అక్కడకు చేరుకోడానికి కావాల్సిన 90 వేల రూపాయలను అందేలా కేవలం ఆరు గంటల్లో వ్యవస్థాపకులు సాయం చేశారు. డిగ్రీ కళాశాల గడప తొక్కని తల్లిదండ్రులు కొడుకు విదేశాల్లో చదువుతున్నాడని తెలిసి మురిసిపోయారు. 'యేల్'లో కొత్త అనుభవాలతో ఆయుష్‌లో పూర్తిగా మార్పు వచ్చింది. యేల్ అనుభవం తన జీవితాన్ని బాగా ప్రభావితం చేసింది. జీవితం పట్ల విశాల దృక్పథాన్ని అవలంబించు కున్నాడు. కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. ఈ లక్ష్య సాధనలో అవంతి సేల్స్ హెడ్, ఎం.ఐ.టి పూర్వ విద్యార్థి అయిన వరుణ్ వర్మ ఎంతో తోడ్పాటును అందించాడు.

అంతా వైవిధ్యమే..

ప్రతి ఏటా మార్చి 14న 'పై' డే సందర్భంగా ఎంపికైన జాబితా విడుదల చేసే ఎంఐటీ ఈ సారి ఇంకా వైవిధ్యంగా సరిగ్గా 09.26.53 గంటల స్థానిక కాలమానంలో ఫలితాలు పొందుపర్చింది. ఇది 'పై' విలువ 3.141592653ను (3/14/15, 9.26.53 గంటలు) సూచించింది. తెల్లార్లూ కళ్ల కాయలు కాచేలా నెట్‌ను శోధించిన ఆయుష్‌కు శుభవార్త కనిపించింది. ఉదయం ఆరు దాటాక సైటు తెరుచుకుంది. ఫలితాలు చూసుకుంటే కంగ్రాట్స్ అన్న సందేశం ఎంఐటీలో సీటును రూఢీ చేసింది. తల్లిదండ్రులతో ఆయుష్ ఆనందాన్ని పంచుకున్నాడు. కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి కూడా జాన్ జే స్కాలర్ సీటు వచ్చినా ఎంఐటీకే ఓటు వేశాడు. సంకల్ప బలంతో తను అనుకున్నదాన్ని సాధించాడు. విలక్షణీయత, ఏకాగ్రత, ఆశావాదంతో కనిపించే ఆయుష్ తన పరిస్థితులను దాటడంలో సఫలమైన మేధావని ముంబైకి చెందిన రెడ్‌పెన్ అడ్మిషన్స్ కన్సల్టెంట్ సహవ్యవస్థాపకురాలు కవితా మెహతా అన్నారు. ఆమె ఆయుష్‌కు రెజ్యూమ్, వ్యాసాలు, కళాశాలల ఎంపిక తదితరాల్లో సాయపడ్డారు.

పరిశోధనా అంశానికి సంబంధించి ప్రస్తుతానికి ఎటువంటి పక్కా ఆలోచనలు లేని ఆయుష్ భౌతిక శాస్త్రాన్ని జల్లెడ పట్టాలని నిర్ణయించుకున్నాడు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విద్యా వ్యవస్థలో మార్పు రావాలని అభిలషిస్తున్న ఆయుష్ ప్రస్తుతం దేశంలోని సాంకేతిక విద్యలో ప్రమాణాలు సంతృప్తికరంగా లేవని విచారిస్తున్నాడు. దీనిపై భవిష్యత్తుల్లో పని ప్రారంభిస్తానని ధీమాగా చెబుతున్నాడు. ✦



ఆయుష్ శర్మ

సావిత్రి... ఓ సువర్ణాధ్యాయం!

సావిత్రి!
అదిగదిగో సావిత్రి
'నటన' కామె గాయత్రి
కష్టాలూ కన్నీళ్ళూ కలబోసిన చరిత్రి! అంటాడు ఆత్రేయ.
మహానటి సావిత్రి జీవితం... నేటితరం, భావితరం కథానాయికలకు అధ్యయన గ్రంథం.

గుంటూరు జిల్లాలో చిన్న పల్లెటూరు. అల్లాడ సుభద్రమ్మ, నిశ్శలకర గురవయ్య దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరూ ఆడపిల్లలే.. తొలి సంతానం మారుతి. రెండవ సంతానమే మన కథానాయిక సావిత్రి. సావిత్రి చిన్న వయస్సులో తండ్రి మరణించడం వల్లనే సుభద్రమ్మ అక్కచెల్లెళ్ళ.! ఆశ్రయించాల్సి వచ్చింది. సుభద్రమ్మ, అన్నపూర్ణమ్మ, దుర్గాంబలు అక్క చెల్లలు. దుర్గాంబ విజయవాడలో వుంటుండేది. విజయవాడకి వచ్చారు. తొలి రోజుల్లో సత్యనారాయణపురంలో వుండేవారు.

బాల సావిత్రి లీలలు

సావిత్రి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్న ఆశతో విజయవాడ సత్యనారాయణపురంలో ఉన్న మద్దాలి సుశీలని కలిశాను.ఈమె నృత్యం, హరికథ ఆలిండియా రేడియో కళాకారిణి. వారు కలిసి నృత్యం నేర్చుకునేవారు. కలిసి డ్రామాల్లో పనిచేసేవారు. సావిత్రిలో ఉన్న గొప్పతనం ఎవర్నయిన చూస్తే ఇట్టే అనుకరించేది. చిన్నప్పటి నుండి నవ్వుతూ నవ్వించడం తన అలవాటు.. ఓటమిని సహించేది కాదు. ఏ ప్రదర్శన చేసినా ప్రశంసల వర్షం కురియాల్సిందే! ఎడమ చేతివాటం. చిన్నతనంలోనే కృష్ణ కాలువ గట్ల మీద నృత్య విన్యాసం, ఎవరైనా సీరియస్‌గా వుంటే ఆ మాట ఈ మాట చెప్పి నవ్వించడం, డాన్సు మాస్టార్ని మెప్పించి ఫీజు కట్టవలసిన డబ్బుతో సినిమాలు చూడటం, చిరు తిళ్ళు తినడం, చేతిలో పైసలుంటే అవి అయిపోయే వరకు పదిమందిని పోగేసుకు తిరగడం... వెరసి అందరిచేత బంగారు తల్లి అనిపించుకోవడం సావిత్రి అలవాటు. ఈ అలవాటులో పొరపాటు.. చదువు అబ్బలేదు. వానకాలం చదువే!

సినీ రంగ ప్రవేశం

సావిత్రి పెద్దతల్లి భర్త కొమ్మారెడ్డి వెంకటరామయ్య చౌదరికి సావిత్రి అంటే ప్రాణం. సావిత్రి ఏమడిగినా కాదనేవాడు కాదు. నటన నాట్యం చూసి పరవశించి పోయేవాడు. డ్రామా ట్రూపుల్లో ప్రదర్శనలు ఇవ్వడాన్ని ప్రోత్సహించాడు. తన మిత్రుడు గోగినేని చెన్నైలో ఉండేవాడు. ఆయన స్నేహితుడు దోనేపూడి కృష్ణమూర్తి యల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసి కలిశారు. ఎ.యన్.ఆర్, యన్.టి.ఆర్ ఇద్దరూ హీరోలే. ప్రసాద్‌గారు "ఏదమ్మా నీకు బాగా నచ్చిన డైలాగు చెప్పు! అని సావిత్రిని అడిగారు. ఆ వాతావరణం చూసి సావిత్రి బోరుమని ఏడ్చి ఇంటికొచ్చేసింది. చౌదరిగారు క్లాసు పీకారు. సావిత్రిలో కసి బయల్దేరింది. రాత్రింబవళ్ళు అద్దం ముందు అభినయం ప్రాక్టీసు చేసింది. మరో ప్రయత్నంగా కె.వి రెడ్డిని కలిశారు. రెడ్డిగారు పాతాళ భైరవి సినిమా చేస్తున్నారు. 'సావిత్రిని గమనించి నువ్వు ఇప్పుడు పనికిరాకపోయినా ముందు ముందు పనికొస్తావప్పా! ఈ సినిమాలో డ్యాన్సుంది. పసుమర్తి కృష్ణమూర్తి మాస్టార్ డ్యాన్సు చేస్తున్నారు. నవరస ప్రధానమైన డ్యాన్సు అది. ముందు ఈ డ్యాన్సు చెయ్యి.' అన్నారు. సావిత్రి కాదనకుండా చేసింది. ఈ చిత్రం తమిళంలో కూడా విడుదలయింది. ఫలానా సినిమాలో చేశాను అని చెప్పుకోవడానికి ఉపయోగపడింది.

యల్.వి. ప్రసాద్ గారు 'సంసారం' చిత్రంలో సావిత్రిని తిరస్కరించినా ఆమెలో ఏదో స్పార్క్ ఉందని 'పెళ్లి చేసి చూడు' చిత్రం కోసం పిలిపించాడు. యన్.టి.ఆర్ హీరో. తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి నిర్మించబడింది. తమిళంలో 'కల్యాణం ఎన్నిపార్'. రెండు భాషల్లోనూ సినిమా విజయవంతమైంది. తర్వాత జగ్గయ్యతో 'ప్రియురాలు', అక్కినేనితో 'శాంతి', రామరావుతో 'పల్లెటూరు' చిత్రాల్లో నటించింది. మొదట 'సంసారం'లో సావిత్రిని తిరస్కరించిన నిర్మాత 'బ్రతుకు దెరువు' కోసం సావిత్రిని ఆశ్రయించాడు. ఇంత వరకూ కేవలం బ్రతుకు దెరువు కోసం అవసరమైన పాత్రలే నటించింది.

సావిత్రి జీవితాన్ని మలుపు తిప్పిన దేవదాసు

డి.యల్. నారాయణ్ ప్రొడక్షన్ వ్యవహారాలు బాగా తెలిసిన వ్యక్తి. ఆయన సినిమా చేస్తున్నారు. వేదాంతం వారు డైరెక్టర్, నాగేశ్వరరావు హీరో. శరత్ చంద్ర చటర్జీ నవల దేవదాసు. చెన్నైలో పుకార్లు షికార్లు చేశాయి. ముందు అక్కినేని సరసన జానకి హీరోయిన్ అనుకున్నారు. అనివార్య కారణాల వలన ఆ పాత్ర సావిత్రిని వరించింది. సినిమా ప్రారంభం ముందు డైరక్టరు 'చూడమ్మా! నువ్వు చాలా చిన్న పిల్లవి. ఇది చాలా బరువైన పాత్ర. నీ పాత్రకు ప్రాణం పోస్తే అందరూ బతుకుతారు. నాగేశ్వరరావుగారి గురించి చెప్పేదే ముంది? ఆయన ఈ పాత్రని ఛాలెంజ్‌గా తీసుకున్నాడు. చేస్తారు. నీ గురించే మా భయం!" అన్నారు.

జెమినీ గణేశన్‌తో.....

“మీకే భయం అక్కర్లేదు.. డైరెక్టరుగారూ! మీ దేవదాసు చిత్రాన్ని మరిచిపోయినా పార్వతి పాత్ర గుర్తుండిపోతుంది. నా మాట నమ్మండి అంది సావిత్రి. షూటింగు మొదలయ్యింది. నిజానికి అక్కినేని, సావిత్రి ఇద్దరూ ప్రాణం పెట్టారు. సుబ్బురామన్ సంగీతం. ఘంటసాల మాస్టారు నేపథ్యగానం. తెలుగు సినిమా సత్తాని భారతీయ భాషా చిత్రాలకు తెలిపింది. సినీ పండితులందరూ అక్కినేనిని ఎంత ప్రశంసించారో సావిత్రిని అంతే ప్రశంసించారు. అవార్డుల పంట పడింది. తెలుగు ప్రేక్షకులు ఎంత ఆదరించారో తమిళ ప్రేక్షకులు అంతకు మించి ఆదరించారు. సావిత్రి తమిళ ఉచ్ఛరణ చూసి ఆమెను తమ ఆడబిడ్డగా గౌరవించారు. సావిత్రి తొలి రోజుల్లోనే ఆమెను మహానటిగా గౌరవించారు.

స్వర్ణయుగపు సౌరభాలు

ఈరోజు తెలుగు సినిమా స్వర్ణయుగపు సౌరభాలు గురించి చెప్పుకోవాలంటే సావిత్రి చిత్రాల గురించే చెప్పుకోవాలి. మాయాబజార్, మిస్సమ్మ, నమ్మినబంటు, దొంగరాముడు, మాంగళ్య బలం, తోడి కోడళ్లు, వెలుగు నీడలు, అభిమానం, కన్యాకుమారి, కలసి ఉంటే కలదు సుఖం, రక్త సంబంధం, పాండవ వనవాసం, నర్తనశాల, మంచి మనసులు, మూగ మనసులు, కోడలు దిద్దిన కాపురం, మాతృదేవత, (గుర్తున్న సినిమాలు మాత్రమే రాస్తున్నాను), వెంకటేశ్వర మహత్యం, మనుషులు మమతలు, సిరిసంపదలు ఇలా ఎన్నో చిత్రాలు. ప్రతి చిత్రమూ ఆణిముత్యమే. సావిత్రి ఈ చిత్రంలో బాగా నటించలేదన్న ఒక్క చిత్రాన్నీ చెప్పలేరు ఏ విమర్శకుడైనా. అదీ సావిత్రి ఘనత.

సావిత్రికి సాటి సావిత్రి

సావిత్రి నటించదు. జీవిస్తుంది. పాత్రల్లో పరకాయ ప్రవేశం చేస్తుంది. మహానటుడు యస్వీ రంగారావు సైతం సావిత్రి సహ పాత్రధారి అయితే సెట్ విడిచి బయటకు వచ్చేవారు కాదు... ఏమో ఎప్పుడు ఏ రియాక్షన్‌తో మొత్తం మార్కులు తన కైవసం చేసుకుంటుందో భయం. సీను చేసినప్పుడు ఇంప్రోవైజేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. సావిత్రి నటన డ్రామాలా అనిపించదు. జీవితంలా అనిపిస్తుంది. పాత్రకి ప్రాణ ప్రతిష్ట చేసినట్లనిపిస్తుంది. యల్వీ ప్రసాద్, కె.వి.రెడ్డి, ఆదుర్తి, యన్.టి.ఆర్., కమలాకర కామేశ్వరరావు వీరంతా సావిత్రిలోని అభినవ సరస్వతిని చూస్తారు.సావిత్రికి ముందు సావిత్రి నేర్చుకోదగ్గ స్థాయి నటన ప్రదర్శించిన నటీమణిలెవ్వరూ లేరు. ఆమె జీవితాన్ని మథించింది. తపస్సు చేసింది. పాత్రలకు సిద్ధత్వం ప్రసాదించింది.

సావిత్రి పతనానికి కారకులెవరు?

నీ తోడిదే లోకం అని నమ్మించి మూడో పెళ్లి చేసుకున్న జెమినీ మొదటి కారణమైతే. సావిత్రి తన మాట వినలేదని... అంత వరకు తన దగ్గరున్న సంపదతో అలిగి వెళ్లిపోయిన చౌదరి రెండో కారణమైతే. తమిళనాట రాజకీయాల్లో ఎం.జి.ఆర్‌కి ప్రతికూల వర్గం మూడో కారణమైతే, సరదాగా నవ్వుతూ నవ్వించడానికీ, నాట్యం నేర్పించడానికీ వచ్చిన నాటి తమిళ స్టార్ కమెడియన్ చంద్రబాబు గమ్మత్తుగా మత్తుని అలవాటు చేయడం మరో కారణం. రాజప్రాసాదం లాంటి నెంబర్ 11 హబీబుల్లా రోడ్ ఇంటిని తమిళనాడు ప్రభుత్వం జప్తు చేయడం, అదే సమయంలో మార్వాడీలు ఎదురుతిరగడం, అందిన చోటల్లా సంపదను సొంతం చేసుకోవడం. బాధల్ని మరిచిపోవడానికి మాతృదేవత సినిమాకి సమర్పకురాలిగా వ్యవహరించి దర్శకత్వం వహించింది. మూగమనసులు సినిమా తమిళంలో ‘ప్రాప్తం’కు నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు తీసుకున్న ఆమె, హిందీలో ‘మిలన్’గా సునీల్ దత్‌తో వచ్చింది. దర్శకుడు ఆదుర్తివారే అయినా అచ్చిరాలేదు. భారీగా నష్టపోయింది. సాటి కళాకారిణులతో నిర్మించ తలపెట్టిన ‘చిన్నారి మనసులు’ అర్థాంతరంగా ఆగిపోయింది. పదితరాల వరకూ కూర్చుని తిన్నా తరగని సంపద హారతి కర్పూరంలా హరించుకుపోయింది. ఆడిటర్లు కనిపించలేదు. ఆత్మీయులు కనిపించలేదు. ఎటుచూసినా అప్పుల వాళ్లే. వున్న ఎస్టేట్స్ సంపదని తెగనమ్మి ప్రశాంత జీవితం గడుపుదామన్నా అవి కోర్టు విచారణలో ఉన్నాయి. హబీబుల్లా రోడ్‌లో సగం స్థలం ఎడమచేత్తో దానం చేసిన సావిత్రి తల దాచుకోవడానికి కాసింత చోటివ్వండి అని అడగడానికి మనస్కరించలేదు. స్వాభిమానానికి నిలువెత్తు నిదర్శనం సావిత్రి.

సంధ్య మలుపులో సావిత్రి

నగరానికి దూరంగా విసిరేసినట్టున్న అన్నానగర్ పొలిమేరల్లో .... దూరం దూరంగా ఇళ్లు.. అందులో ఒక సింగిల్ బెడ్ రూమ్. అయిదు వందల రూపాయలు అద్దె కొంప. ఆరు బయట తాటాకుల పందిరి. పందిరి కింద తనతో పాటూ ప్రయాణం చేసిన విజయోత్సవ జ్ఞాపికలు.. ఆరోజుల్లో షీల్డులో వెండి, బంగారం కూడా ఉంటుందని తెలియని అమాయకురాలు. అది తెలిసి నీ జ్ఞాపకంగా ఉంచుకుంటానమ్మా అంటూ చేతికందినన్ని పట్టుకెళ్ళిన ప్రబుద్ధులు.. మూలన నోరు మెదపనట్లుండే ఫియెట్ కారు. పనిమనుషులు లేరు. దాసదాసీ జనాలు లేరు. వందలాది మందికి సరిపడా ఫలహారాలూ, భోజనాలూ వండాల్సిన అవసరం లేదు. ఏడ్పులు తప్ప పలకరించే దిక్కు లేదు. బిక్కుబిక్కుమంటూ, ఎవరైనా తెలిసిన మొహం కనిపిస్తుందా అని ఆశతో ఎదురు చూసే... కన్నీరింకిన గాజుకళ్ళు. రాజమహల్‌లో మహారాణిలా తిరిగే మహానటి సావిత్రి బోయ వాడి వేటకి గాయపడిన లేడిలా విలవిల్లాడుతూ కనిపించేది. అభిమానులు పంపించే మనీయార్డర్లే అండదండలు. తన చుట్టూ రాత్రింబవళ్లు భయంకరమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని జయించే ప్రయత్నంలో మత్తుని ఆహ్వానించి.. జీవితంలో చిత్తుగా ఓడిపోయింది. నిజానికి సావిత్రి సంధ్య మలుపులో లేదు. నెట్టబడింది.

‘ఆత్మ ’కి అర్థం తెలియని వారికోసం ఆత్మకథ రాయాలా?

రాజబాబు సావిత్రికి ఘనసన్మానం తలపెట్టాడు. దానికి హాజరైన జగ్గయ్య మాట్లాడుతూ సావిత్రిని ఆత్మకథ రాయాలని, భావి కళాకారులకు పాఠ్యగ్రంథమవుతుందని కోరాడు. దానికి సావిత్రి స్పందిస్తూ “తమ్ముడు రాజబాబు ఈ సావిత్రి అంధకారంలో వుందని జాలి పడి నన్ను నలుగురికీ చూపించే ప్రయత్నంలో చిరు దీపం వెలిగించాడు. ఈ సినీ మాయ ప్రపంచంలో వీస్తున్న విషగాలులకు ఈ దీపం ఆరిపోకుండా వుంటుందా? బావగారు(జగ్గయ్య) చిన్నప్పుడు నా ప్రదర్శన చూసి నన్ను ఎత్తుకొని ముద్దాడేవారు. ఆత్మకథ రాయమన్నారు. ఎవరి కోసం రాయాలి ఆత్మకథ? నేను రాయడం మొదలు పెడితే ఒక్కరు.. ఒక్కరు మిగలరు. బాధ రుచేమిటో నాకు తెలుసు. నా బాధను దిగమింగడానికి ఇంత మందిని బాధపెట్టాలా? ఆత్మలేని ఈ మనుషుల కోసం నేను ఆత్మకథ ఎందుకు రాయాలి? సావిత్రి భౌతికంగా మరణిస్తుంది, తెలుగు సినిమా ఉన్నంత కాలం బ్రతికే ఉంటుంది. ఈ జీవితానికి ఆ తృప్తి చాలు.” అంటూ పొర్లుకొచ్చిన దుఃఖాన్ని ఆపుకుంటూ ముగించింది నిజం. తెలుగు సినీ వైభవంలో సావిత్రి... ఓ సువర్ణాధ్యాయం.!

ఇమంది రామారావు
9010133844

టెకీ రైతులు

పల్లె కన్నీరు పెడుతుందే కనిపించని కుట్రల.. నా తల్లి బంధీ అవుతుందే... అని గ్రామ జీవన విధ్వంసాన్ని తట్టుకోలేక పాటై విలపించాడు ఓ నేతన్న. పట్టణాలకు వలసలతో ఖాళీ అవుతున్న పల్లెలు, తరం అందిరాక దగా పడుతున్న వ్యవసాయం గురించి దిగులు పెట్టుకున్నాడు. ఆయన వేదన వృథా కాలేదు. విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలను వదులుకుని, పట్టణ జీవితపు విలాసాల్ని తెంచుకుని, కంప్యూటర్ల ముందు దర్జాగా చేసే పనిని తోసిరాజని పల్లెల్లో వ్యవసాయం చేసేందుకు తిరిగి వస్తున్నారు రైతుబిడ్డలు. ఐటీ, హోటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర రంగాల్లో స్థిరపడినవారే వీరంతా. అధునాతన సాంకేతికతతో, నూతన విధానాలతో, సరికొత్త ప్రయోగాలతో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చి మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పల్లెల అభివృద్ధికీ తమ వంతు సాయం చేస్తున్నారు.

సబితా, రెగో

మూడు ఆవులతో మొదలై..

బెంగళూరుకు చెందిన సంతోష్ డి సింగ్ తొమ్మిదేళ్లు ఐటీ ఉద్యోగాన్ని చేశాడు. అతడికి హాలెనహల్లిలో వారసత్వంగా మూడు ఎకరాల వ్యవసాయ భూమి వచ్చింది. తన సోదరులు రాజేష్, సతీష్‌తో కలిసి 2010లో మూడు ఆవులతో అమృత డైరీఫామ్స్ మొదలు పెట్టాడు. ఉద్యోగం వదులుకుని పూర్తిగా డైరీకే అంకితమయ్యాడు. ఏడాది పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని 20 లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాడు. కొద్దికాలంలోనే లాభాలందుకుని 50 ఆవుల వరకు డైరీ వృద్ధి చెందింది. నాబార్డ్ వారి సహకారంతో 100 ఆవులున్న కమర్షియల్ డైరీగా రూపొందింది. మూడేళ్ల కరువు వాళ్లకు సవాలు విసిరినా ప్రత్యేక పశుపెంపకం ద్వారా ఎదుర్కున్నారు. పశు దాణాకి ఇబ్బంది కలగకుండా మట్టితో కాకుండా నీటిలోనే లవణాలను, ఖనిజాలను కలిపి మొక్కలను పెంచే 'హైడ్రోపోనిక్స్' అనే విధానంలో మొక్కల్ని పెంచాడు.

ఐమ్యాక్ వద్దు.. మట్టి ముద్దే ముద్దు

మంగుళూరుకు చెందిన అరుణ్ మెహండలే ఓ టెకీ. బెంగళూరు ఒరకిల్ కంపెనీలో సీనియర్ టెక్నికల్ పోస్టు ఎదురుచూస్తోంది అతని కోసం. ఈలోగా ఆయన భార్యకు వారి సొంత గ్రామమైన తేన్కకారందూర్ సమీపంలోని కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. గ్రామంలో వారికి నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. అరుణ్ తాతలు, తండ్రిది వ్యవసాయ వృత్తే. ఐమ్యాక్స్‌లో హాయిగా కూర్చుని చేసే ఉద్యోగాన్ని కాదనుకుని వారసత్వంగా వచ్చిన వ్యవసాయంలోకి దిగాడు. తండ్రిని ఒప్పించి హార్టికల్చర్ పంటలతో పాటు స్థానిక వంగడమైన బ్రౌన్ రైస్‌ను పండించాడు. గతేడాదే లక్ష రూపాయల పెట్టుబడితో కొకొవా, కొబ్బరిని ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతిలో పండించి లాభాలు పొందాడు. కూలీల కొరతతో సతమతమైన అరుణ్ కొబ్బరి చెట్టు ఎక్కే సాధనాన్ని తక్కువ ఖర్చుతో రూపొందించుకున్నాడు.

ఎన్నారై తోటరాముడు

బీహార్‌కు చెందిన ఆనంద్ మాల్దా యూకేలోని ఓ పెద్ద మేనేజ్‌మెంట్ స్కూల్‌లో ఎంబీఏ చదివి లండన్‌లో లక్షల జీతానిచ్చే కొలువు సంపాదించాడు. సంతోషాన్ని పంచుకునేందుకు తన గ్రామమైన రాంపూర్‌కు వచ్చిన ఆయనకు పేదరికం స్వాగతించింది. తన గ్రామ దుస్థితి మార్చేందుకు సంకల్పించి వ్యవసాయాన్ని పనిముట్టుగా చేసుకున్నాడు. చాలా దేశాల్లోని మామిడి సాగు తీరును పరిశీలించి, రెండేళ్ల క్రితం కొత్త విధానంలో మామిడి తోటల్ని వేశాడు. పది లక్షల రూపాయల్ని ఖర్చుపెట్టి నిపుణుల్ని, సాంకేతికతను ఉపయోగించి ఎకరానికి 43 చెట్లకు బదులు 120 చెట్లను పెంచాడు. మంచి దిగుబడి సాధించి 50 లక్షల రూపాయలు వరకు టర్నోవర్ రావడంతో పాటు బీహార్‌లోనే అతి సాంద్రత కలిగిన వ్యవసాయ క్షేత్రంగాను రికార్డు కొట్టింది. తన గ్రామాన్ని మోడల్ గ్రామంగా మార్చాలనే ఆశయంతో మత్స్య, బాతు పెంపకాన్ని చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆరోగ్య కేంద్రాన్ని, ఆహారోత్పత్తి పరిశ్రమను ఏర్పాటు చేసే పనిలో ఉన్నాడు.

ఈ సైంటిస్ట్‌కు మట్టి అంటే ఇష్టం

గుజరాత్‌కు చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ డి.వినోద్‌కు వ్యవసాయమంటే చాలా ఇష్టం. అందులోను నల్ల మిరియాల వాసనల్ని పోగుచేసిన మట్టి పని ఇష్టం. కుటుంబ సభ్యులు వారించినా తన పెన్షన్ డబ్బుతో మిరియాల సాగును చేపట్టాడు. కేవలం లాభాపేక్షతో కాకుండా అభిరుచితో పండించి సంతోషం పొందుతున్నాడు. మంచి లాభాల్ని అందుకుని హాయిగా కాలం సాగుచేస్తున్నాడు.

ఆర్గానికానందం

ముంబైకి చెందిన ఫర్నీచర్ డీలర్ జూలియస్ రెగో, కాపీరైటర్ సబితా రాజేంద్రన్‌లకు ఆరోగ్యానందించే ఆర్గానిక్ ఉత్పత్తులంటే చాలా ఇష్టం. పురుగు మందులు ఉపయోగించని ఈ ఆహారాన్ని వాడేలా చుట్టుపక్కల వాళ్లను ప్రోత్సహించేవారు. కేవలం అక్కడికే పరిమితం కాక నవీ ముంబైలో కేవలం 20 వేల రూపాయల పెట్టుబడితో గ్రీన్ సోల్స్ అనే ఆర్గానిక్ సాగును చేపట్టారు. 2011లో ప్రారంభించి ఇప్పటికే సుమారు 60 రకాల కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పూల రకాల్ని సాగు చేశారు. దగ్గరిలోని టాటా మెమోరియల్ హాస్పిటల్ వాటిని కొంటోంది. లాభాల్లోని కొంత వాటాను వర్క్‌షాప్‌ల నిర్వహణకు ఉపయోగిస్తూ మరింత మంది ఈ వ్యవసాయంలో ప్రవేశించేందుకు తోడ్పడుతున్నారు.

పూల గంధంలో..

మంగుళూరుకు చెందిన రమేష్ శెట్టి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్ని అమ్మేవాడు. కొత్త కొత్త ఉత్పత్తుల వెల్లువతో మార్కెట్ ఎప్పుడు ఎలా మారుతుందో అర్థంకాక తలపట్టుకునేవాడు. అప్పుడు ఆయనకు బెంగళూరు సమీప గ్రామంలోని ఐదెకరాల తన తండ్రి సాగు భూమి గుర్తొచ్చింది. వెంటనే అక్కడకు మకాం మార్చేసి గులాబీలు, చామంతులు వంటి పూల మొక్కలను వేశాడు. ఇప్పుడు తన ఫాంహౌజ్‌లో దిలాసాగా గడుపుతూ పూల వాసనల్ని ఆస్వాదిస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. ప్రతి ఏటా 30 శాతం వృద్ధి కనిపిస్తూ లాభాలను అందిస్తోందీ పంట.

స్వల్పకాలిక పంటలు పెద్ద లాభాలు

ఎంబీయే చదివి చెన్నైలో ఉద్యోగం సంపాదించిన రాజా మురుగన్ (27)కు సుమారు 400 కి.మీ. దూరానున్న తన గ్రామం గుర్తొచ్చింది. తిరుచేగోడులోని తమ స్వంత భూమిలో చిన్న చిన్న మార్పులు చేపట్టాడు. తల్లిదండ్రులకు వ్యవసాయం చేయాలనుకుంటున్న విషయం చెప్పి ఒప్పించాడు. పప్పు ధాన్యాలపై పరిశోధనలు సాగించి పనిలోకి దిగాడు. స్థానిక రైతుల్లోను స్వల్పకాలిక పంటలపై చైతన్యం తెచ్చి గ్రామన్ని అభివృద్ధిలో పాలు పంచుకున్నాడు.

ఇద్దరు మిత్రులు

తమిళనాడుకు చెందని శరవణన్, జగన్నాథన్ చిన్ననాటి మిత్రులు. జగన్నాథన్ అమెరికాలో ఐటీ కొలువు సంపాదించి స్థిరపడితే, శరవణన్ హోటల్ మేనేజ్‌మెంట్ చేసి ఓ ఫైవ్ స్టార్ హోటల్లో డెవలప్‌మెంట్ మేనేజర్‌గా చేరాడు. తన ఉద్యోగంలో భాగంగా పలు చోట్లలో తిరిగిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు. చెన్నై సమీపంలోని 2011లో తిరునర్వేర్ గ్రామంలో ఆరు ఎకరాల భూమి కొని వ్యవసాయం ప్రారంభించాడు. మిత్రుడు జగన్నాథన్ కూడా తిరిగి వచ్చి అతనితో చేతులు కలిపాడు. ఇద్దరి కలిసి నూతన సాగు విధానాల్ని అవలంబిస్తూ 45 రకాల ఆకుకూరల్ని, పసుపు తదితర పంటల్ని పండిస్తున్నారు.

సహజసిద్ధమే లాభం...

నిఖిల్ కూరగంటిది (26) హైదరాబాద్. 2011లో ఆర్గానిక్ వ్యవసాయంలో నిపుణుడైన పెరిగ్రీన్ మోహన్‌ను కలిశాడు. పురుగు మందులు వాడకుండా సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయడంలో మెళుకువల్ని తెలుసుకున్నాడు. వికారాబాద్‌లో తన జట్టుతో కలిసి 25 ఎకరాల్లో సహజ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేపట్టాడు. ఆరు రకాల పప్పు ధాన్యాలు, 25 రకాల కూరగాయల్ని పండిస్తున్నాడు. ఎకరానికి 35 వేల రూపాయల్ని పెట్టుబడి పెట్టారు. మంచి లాభాలు రావడంతో పొరుగు రైతుల్ని ఈ దిశగా అడుగులు వేయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. గాలి ఉధృతిని తట్టుకోవడానికి ఒకే వరసలో కాకుండా జిగ్‌జాగ్ (రంపపు పళ్ల) వరసలో చెట్లను నాటే పద్ధతిని పరిచయం చేశాడు. ✦



విప్లవ వీరుడు

ఆనాటికి ప్రపంచంలో అజేయమైన సైనిక శక్తిగా ఉండి... రవి అస్తమించని బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన విప్లవ జ్యోతి. ఆదివాసి ప్రజల రాజకీయ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వీర కిశోరం. ఏజెన్సీ ప్రాంత గిరిజనుల మౌలిక సమస్యలను, పరిష్కారాలను ఎజెండాగా చర్చనీయాంశం చేయడంలో జయప్రదమైన పోరాటయోధుడు, తెలుగు ప్రజలందరికి నిరంతరం స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు.

1897 జూలై నాలుగవ తేదీన జన్మించి 1924లో (మే 7న) బ్రిటిష్ వారి తూటాలకు బలై వీరమరణం పొందిన అల్లూరి జీవించింది 27 సంవత్సరాలు మాత్రమే. అల్లూరి వెంకట రామరాజు – నారాయణమ్మ దంపతుల రెండవ సంతానం రామరాజు (అక్క సీత, తమ్ముడు సత్యనారాయణ రాజు). సీతారామరాజు తండ్రి స్వాతంత్ర్య ప్రియుడు. బ్రిటిష్ వ్యతిరేకి. రాజమండ్రి వచ్చిన బిపిన్ చంద్రపాల్ ప్రసంగం... వందేమాతరం ఉద్యమం...తండ్రి స్వతంత్ర భావాలు రామరాజును ఎంతగానో ప్రభావితం చేశాయి. 'విదేశీ చదువులూ ఒక చదువులేనా!' అంటూ విద్యను మధ్యలోనే వదిలేసాడు. దేశ పర్యటన చేసి జాతీయోద్యమ నాయకులను కలుసుకోవడంతోపాటు, విప్లవకారులతో రహస్య సమావేశంలో కూడా పాల్గొన్నాడు. తర్వాత మన్య ప్రాంతం చేరుకున్నాడు. అక్కడ మన్యం ప్రజలపై బ్రిటిష్ అధికారుల దోపిడీ, దౌర్జన్యాలను చూసి చలించిపోయాడు. బ్రిటిష్ అటవీ చట్టాలు, రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో అడవి తల్లి నుండి అడవి బిడ్డలను వేరు చేసి వేధింపులు మొదలు పెట్టింది ప్రభుత్వం. కోయ ప్రజల కష్టాలు అధికమయ్యాయి. అయిదేళ్ళపాటు కోయ ప్రజల మధ్య సంచరిస్తూ వారి సమస్యలపై పోరాడుతూ వారి విశ్వాసాన్ని పూర్తిగా చూరగొని ఒక ఆశాజ్యోతిగా కన్పించసాగాడు.

గిరిపుత్రులు తాము కోల్పోయిన భూములను తిరిగి దున్నుకోమని చెప్పాడు రామరాజు. రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ ఉత్పత్తులు సేకరించుకోవడం జన్మహక్కు అని వారిని చైతన్య పరిచాడు. పోలీసుల జోక్యం అవసరం రాకుండానే... గిరిజన సంప్రదాయ పద్ధతులలో ... పంచాయతి కోర్టులలోనే ప్రజల వివాదాలు పరిష్కారం కాసాగాయి. గ్రామాల మీదబడి ఫారెస్ట్ పోలీసులు లూటీ చేయడం... శిస్తుల పేరుతో రెవెన్యూ వారు పీడించడానికి వ్యతిరేకంగా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ ఉద్యమం మొదలైంది. మద్యపానం మాన్పించడానికి ప్రచారం చేసాడు. చింతపల్లి ఘాట్‌రోడ్ నిర్మాణ పనులు చేయించడానికి తీసుకెళ్లి కోయ ప్రజల శ్రమను దారుణంగా దోచుకుంటున్న అధికారుల నుండి కాపాడి కూలీ ఇప్పించాడు. విప్లవ ప్రభావిత ప్రాంతమంతటా ప్రజలు పెద్ద సంఖ్యలో తాగుడు మానేశారు. ప్రభుత్వ కోర్టులను, పోలీస్ స్టేషన్లను బహిష్కరించారు. సీతారామరాజు మాటే మన్యంలో వేదంలా చెల్లుబాటవసాగింది. దీంతో అధికారులు, మన్యంపై యుద్ధం ప్రకటించారు. రామరాజును అరెస్ట్ చేసి తర్వాత విడుదల చేశారు.

గెరిల్లా యుద్ధం

రామరాజు మన్యంలో అడుగుపెట్టిన తొలి నాళ్ళలోనే కోయదొరల దగ్గర విలు విద్య నేర్చుకున్నాడు. ఆ తర్వాత బ్రిటిష్ వారి దాడి తీవ్రతరం కావడంతో విల్లంబులతో సైన్యం ఏర్పాటు చేశాడు.

అయితే... తప్పులు చేస్తున్న కింది స్థాయి ఉద్యోగులను రామరాజు మందలించి వదిలివేశాడు తప్ప ఎవరినీ చంపలేదు. చిత్రహింసలు పెట్టలేదు. ఇది ఆయన నిబద్ధత, నిజాయతీకి నిదర్శనం. తన యుద్ధం దొరలపైన మాత్రమేనని ప్రకటించాడు. ప్రత్యేక గుర్రాల రవాణా, వైర్‌లెస్

అమాయకులూ అసహాయులైన అడవి బిడ్డలనే సైన్యంగా సమీకరించి.. ఆంగ్లేయ ప్రభుత్వాన్ని ధిక్కరించి..ఉత్తేజ ప్రదాతగా శాశ్వతంగా నిలిచిపోయిన తెలుగు విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు. సమరశీలతలో, సాహసంలో తన కాలం కన్నా ముందున్న వాడు.. అహింసా జపాన్ని అధిగమించి ఆయుధాలు చేబూని మన్య విప్లవం రగిలించిన వాడు అల్లూరి.. భారతీయులకు నాగరికత నేర్పామని గొప్పలు పోయే తెల్ల దొరల అమానుషానికి బలైన అమరజ్యోతి.. ఆదివాసుల అడవులూ కొండలూ గనులూ కార్పొరేట్లకు కట్టబెడుతున్న నేటి సరళీకరణ యుగంలో ఆయన అడుగుజాడలు అనుసరణీయాలు.. స్మరణీయాలు..

- బండారు రవికుమార్
9490098090

సెట్లను సమకూర్చుకోవడం ద్వారా అడవుల్లో గెరిల్లా యుద్ధంలో శిక్షణ పొందిన ప్రత్యేక మలబార్ పోలీసులను తీసుకొచ్చింది బ్రిటిష్ ప్రభుత్వం. ధైర్య సాహసాలకు మారుపేరైన రామరాజు సమర్ధవంతమైన గూఢచార వ్యవస్థతో పటిష్టమైన గెరిల్లా వ్యూహాలు అమలు జరిపాడు. ఇంత చక్కటి ప్రణాళిక, వ్యూహాలు ఉన్నప్పటికి మొదటి ప్రపంచ యుద్ధంలో ఆరి తేరిన సైనికాధికారులు, వారి ఆయుధాలు, ప్రత్యేక శిక్షణ ఉన్న దళాలతో మన్యానికి గట్టి దెబ్బలు తగిలాయి. మారిన ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టడానికి ఆయుధాలు సమకూర్చు కోవాలని విప్లవకారుల్లో ఆత్మస్థైర్యం దెబ్బ తినకుండా చూడాలని రామరాజు భావించాడు. అందుకు తగ్గట్టు ఆయుధ శిక్షణ ఇప్పించాడు. రంపచోడవరం రాజవొమ్మంగి, కృష్ణదేవి పేట, చింతపల్లి, అడ్డతీగల, నర్సీ పట్నం తదితర ప్రాంత పోలీస్ స్టేషన్లను కొల్లగొట్టడానికి తుపాకులు, మందుగుండు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కూడా స్థానిక పోలీసు సిబ్బందిని ఏమీ చేయకుండా వదిలేశారు. ప్రజలను పీడించవద్దని హెచ్చరించి వదిలి పెట్టారు. .

గంటం దొర, మల్లు దొర, ఎండు పడాలు, అగ్గిరాజు లాంటి మహా వీరులు రామరాజు విప్లవోద్యమంలో దళాలకు నాయకత్వం వహించారు. దోపిడీని మౌనంగా భరించడం తప్ప ఎదురు చెప్పలేని అడవి బిడ్డలు అల్లూరి విప్లవ సైన్యంలో సమరశంఖం పూరించారు.

బాల్యంలోనే శౌర్యం

అల్లూరి సీతారామరాజు
చిన్ననాటి ఫొటో

(రామరాజు గురించి చిన్ననాటి సహచరుడు మద్దూరి అన్నపూర్ణయ్య జ్ఞాపకాలు)

పాఠాలు శ్రద్ధగా చదవకపోతే ఎలాగని నేను కోప్పడినప్పుడు రామరాజు "ఎందుకురా బానిస చదువు ? దేశానికి సేవ చేయాలి కాని" అనేవాడు. నేను "బి.ఎ అయిననూ చదువనిదే సేవ ఏమి చేస్తావు?" అని ప్రశ్నిస్తే సమాధానంగా "దేశానికి సేవ చేయడానికి బి.ఎ ఎందుకురా?" అనేవాడు. "చూశావా! పక్షులు ఎంత స్వేచ్ఛగా ఎగురుతున్నాయో. మనకటువంటి స్వేచ్ఛ ఉన్నదా?" అని రామరాజు ప్రశ్నించేవాడు. నేను కూడా రామరాజు చర్యలన్నియు జ్ఞప్తికి తెచ్చుకొని బి.ఎ పరీక్ష మూడు నెలలుండగా చదువుకు స్వస్తి చెప్పాను. గాంధీ 51 సంవత్సరాల వయస్సులో కాలేజీలు విడిచి రమ్మని చెప్పిన మాట రామరాజు 14 సంవత్సరాల వయస్సులోనే చెప్పాడు.

కవర్డ్, హైటర్ వంటి నరహంతక అధికార్లను తిరుగుబాటులో భాగంగా చంపివేసింది అల్లూరి సైన్యం. మేజర్ గుడాల్ అనే క్రూర సైనికాధికారిని, సైనిక బలగాలను, ఫిరంగులను మన్యం గడ్డపై మోహరించింది ప్రభుత్వం. అయినాసరే ఆదివాసీ సైన్యం ఏమాత్రం వెనకడుగేయక... వీరోచితంగా దారి పొడవునా గుండెనెత్తురులు తర్పణం చేస్తూ ముందుకు సాగింది. అశేష త్యాగాలు చేసింది. అంతిమంగా 1924 జనవరి 27న రూథర్‌ఫర్డ్‌ను మన్యం అధికారిగా కేటాయించింది ప్రభుత్వం.

అస్సాం రైఫిల్స్ దళాలను, గూర్కా దళాలను నర్సీపట్నానికి రప్పించింది. విప్లవకారులను గిరిజన ప్రజలు తమ గుండెల్లో దాచుకున్నారు. అల్లూరి సీతారామరాజును పట్టి ఇచ్చిన వారికి లేదా ఆచూకీ తెలిపిన వారికి పదివేల రూపాయల బహుమతి. ఆయన అనుచరుల ఆచూకీ తెలిపిన వారికి అయిదువేల రూపాయలు ఇస్తామని వారి తలలకు వెల నిర్ణయించారు.

విప్లవకారులు గ్రామాలకు దూరంగా గుట్టల్లో, కొండల్లో తల దాచుకుంటూ గెరిల్లా యుద్ధం కొనసాగించారు. బ్రిటిష్ సైనికులు గిరిజన గ్రామాలకు గ్రామాలు తగులబెట్టి బూడిద చేశారు. రామరాజు ఎక్కడున్నాడో చెప్పమని చిత్రహింసలు పెట్టారు. పురుషుల ముందే మహిళలను మానభంగాలు చేశారు. విప్లవకారులను పంపిన వారి కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు లక్ష్యంగా మారాయి. రంపకొండల్లోని ప్రతి ఇల్లు 'పూర్తి తనిఖీలకు' గురైంది.

గిరిజన గ్రామస్తుల వలే కాకుండా గిరిజనేతర గ్రామపెద్దలు, మద్దతుదార్లు, మున్సిఫ్‌లతో కూడిన ధనవంతులు గోడమీద పిల్లి వాటంగా వ్యవహరించారు. విప్లవకారులు పైచేయిగా ఉన్నప్పుడు ఉద్యమానికి సహాయమందించిన వీరు... పోలీసుల అణిచివేత నేపథ్యంలో ఒకవేళ తిరుగు బాటు విఫలమైతే సురక్షితంగా ఉండేందుకు గోడ రెండవ వైపుకు దూకారు. గ్రామ మున్సిఫ్‌లు విప్లవ కారులను పట్టుకొచ్చి అప్పగించిన ఘటనలు, ప్రముఖ నేతల అరెస్టులకు దారితీసిన సమాచారాన్ని అందించిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

రామరాజు ఆదేశాలకు విరుద్ధంగా ఆంగ్లేయుల తొత్తులనే పేరుతో స్వదేశీయులను హతమార్చే ఆత్మహత్యా సదృశ్యమైన విధానాన్ని

అల్లూరి రాసిన లేఖ





మన్యంలో రామరాజు విగ్రహాలు నేటికీ స్ఫూర్తి చిహ్నాలు

తిరుగులేని నిఘా

రామరాజుకు అత్యంత సమర్థమైన గూఢచార వ్యవస్థ వుండేది. అది ఎంత బలంగా వుండేదంటే... ఆంగ్లేయుల బలగం బయలుదేరిన వెను వెంటనే దాని కదలికలు, వార్తలు అతనికి చేరేంతగా. ఒకవేళ అతనికి సంబంధించిన విషయాలు ఏవైనా ఆంగ్లేయులకు చేరినా అవి వారిని తప్పు దారి పట్టించేందుకు రామరాజు స్వయంగా పంపేవే. పైగా రామరాజు అనుచరులు ... ఆంగ్లేయుల వార్తాహరులను అడ్డగించి ఉత్తరాలు తీసుకునేవారు. దాంతో ఉత్తరాలను సంకేతాలతోనో, ఫ్రెంచి భాషలోనో రాయడం మొదలెట్టారు ఆంగ్లేయులు. అంతేకాక రామరాజు యుద్ధ స్థావరాలు అత్యంత పటిష్టంగా వుండేవి. దుర్గమమైన ప్రదేశాల్లో తన శిబిరాలను నిర్మించుకునేవాడు. ఒకవేళ దాడి జరిగినా సులభంగా తప్పించుకోవడానికి వీలైన స్థలాన్నే ఎంచుకునేవాడు.

అమలుచేశాడు అగ్గిరాజు. దాంతో గంటం దొర, అగ్గిరాజుల మధ్య సదవగాహన కరువైంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి పర్లాచిమిడి ప్రాంతం నుంచి రామరాజు ఇక్కడకు చేరుకున్నాడు. ఈలోగా విప్లవకారుల వద్ద ఆయుధాలు, మందుగుండు అయిపోయింది. విప్లవోద్యమంలో వీరోచితంగా పోరాడిన ప్రముఖ నాయకులు గంటం దొర, ఎండు పడాలు కూడా వీరమరణం పొందారు. మల్లుదొర బ్రిటిష్ వారికి దొరికిపోవడంతో అండమాన్ జైలుకు పంపారు. మద్దేరు నది వద్ద జరిగిన పోరాటంలో అగ్గిరాజు అరెస్ట్ అయ్యాడు. 1924 మే 6న రామరాజు ఒక కొండ దగ్గర మకాం వున్నాడు. దాహం తీర్చుకోవడానికి కొండ దిగి సెలయేరు దగ్గరకు వచ్చాడు. సెలయేరు ఆవలి ఒడ్డున ఉన్న పోలీసులకు నీళ్ల తేవడానికి వచ్చినవారు రామరాజును చూశారు. ఇంకేముంది! అక్కడున్న సైన్యానికి సమాచారం అందింది! రామరాజును సెలయేరు వద్ద చుట్టు ముట్టి బంధించారు. మేజర్ గుడాల్ మకాం వద్ద రామరాజుకు, గుడాల్‌కు వాదప్రతివాదాలు జరిగాయి. తమ దేశానికి, మన్య ప్రాంతానికి బ్రిటిష్ పరిపాలన వలనే దుర్భర పరిస్థితి ఏర్పడిందంటూ గుడాల్‌తో కరచాలనం చేయడానికి సైతం నిరాకరించాడు రామరాజు.

రామరాజు హృదయం

వందేమాతరమంటూ నినదించిన బంగాళం
స్వరాజ్యంబు జన్మహక్కని చాటిన మహారాష్ట్రం
హింసకు ప్రతిహింస యన్న వీర భూమి
పాంచాలం
అన్నిటికీ నెలవాయెను ఆంధ్ర వీర హృదయం,
మన రామరాజు హృదయం
-ఆరుద్ర

కట్టుకథ...

నిజానికి ఆరోజు రామరాజును చెట్టుకు కట్టివేసి మేజర్ గుడాల్ కాల్పులకు ఆదేశించాడు. కాల్చడానికి ముందు రామరాజునుద్దేశించి 'నిన్ను చంపాలని నిర్ణయించుకున్నాం. నీవు చెప్పుకొనేది ఏమైనా ఉందా?' అని మేజర్ ప్రశ్నించాడు. అప్పుడు రామరాజు "నన్ను న్యాయ విచారణకు కోర్టుకు హాజరు పరచాలి. మీరు అందుకు సిద్ధంగా లేకపోతే... నా మాతృభూమి కోసం నేను చావడానికైనా సిద్ధంగా ఉన్నాను." అని ప్రకటించాడు. అప్పుడు చెట్టుకు చేతులు విరిచి కట్టి ముఖాన్ని కప్పివేశారు. రామరాజు గుండెలపై గురి చూసి కాల్చి చంపాడు మేజర్.

అల్లూరి సోదరి సీతమ్మ

అల్లూరి తల్లి సూర్యనారాయణమ్మ

కాని తర్వాత బ్రిటిష్ అధికారులు రామరాజు పారిపోతుంటే వెనుక నుంచి కాల్చి చంపారని కట్టుకథను ప్రచారంలో పెట్టారు. అయితే రామరాజు ఘోర హత్యను కళ్ళారా చూసిన కొయ్యూరు గ్రామ వాసులు దీన్ని ఖండించారు. రామరాజును కట్టివేసిన చెట్టును సైతం గుర్తు లేకుండా కాల్చి బూడిద చేసి ఏటిలో కలిపారని వారు తెలిపారు. రామరాజు మృతదేహాన్ని మరునాడు (మే 8, 1924) దహనం చేయడానికి ముందు కృష్ణదేవి పేటలో ఫోటో తీయించారు. తర్వాత లభ్యమైన ఈ ఫోటో చూసిన వారికెవరికైనా... బ్రిటిష్ వారు నర్సీపట్నం డాక్టరు చేత రామరాజు శరీరం వెనుక వైపు తుపాకీ కాల్పులున్నాయని తప్పుడు రిపోర్టు రాయించారని అర్థమౌతుంది.

నిత్య స్ఫూర్తి ప్రదాత

రామరాజు ధైర్యసాహసాలు, దేశభక్తి, గెరిల్లా యుద్ధ నైపుణ్యం, మానవత్వం, వ్యక్తిగత జీవితంలో నిజాయతీ, క్రమశిక్షణ, తను నమ్మిన మార్గాన్ని ఆచరించడంలో నిబద్ధత, ప్రజల కార్యాచరణ పట్ల ఆయనకున్న విశ్వాసం, నిరంతరం ఉత్తేజాన్ని స్తాయి. అడవిబిడ్డలు రామరాజును పూర్తిగా విశ్వసించి ఆయన వెంట నడవడానికి ఇవే ప్రధాన కారణమయ్యాయి.

నాడూ నేడూ ఒకే నిర్బంధం

నేడు రామరాజు, కొమరం భీమ్, రాంజీ గోండు, సోయం గంగులు, గంటం దొర, ఎండు పడాల్ లాంటి ఎందరో ఆదివాసీ పోరాట యోధుల త్యాగధనుల త్యాగానికే పాలకులు తూట్లు పొడిచి ఆదివాసీల ఉనికినే లేకుండా చేస్తున్నారు. సెజ్‌లు, భూ సేకరణలు, భారీ విధ్వంస ప్రాజెక్టులు, మైనింగ్ పేరుతో గిరిజన చట్టాల అతిక్రమణను నాటి బ్రిటిష్ పాలకులకు ఏమాత్రం తీసి పోని విధంగా నేటి ప్రధాని మోడీ, రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు వ్యవహరిస్తున్నారు. పోడు భూముల సాగుదారులను భూముల నుండి వెళ్ళగొట్టడం, దాడులు, దౌర్జన్యాలు, నిర్బంధం మళ్ళీ నాటి పరిస్థితులనే తలపిస్తున్నాయి. "అభివృద్ధి" పేర లక్షల ఎకరాల అడవిని ధ్వంసం చేయడానికి .... బహుళ జాతి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి పాలకులే పర్యావరణానికి తీవ్రమైన హాని చేస్తున్నారు. అల్లూరి పోరాట త్యాగాల స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం, ఉనికి కోసం పోరాటం కొనసాగించడమే అల్లూరికి మనం ఇవ్వదగిన నిజమైన నివాళి.

✦

నాతో చేరండి!

సెప్టెంబరు 13వ తేదీ మధ్యాహ్నం అడ్డాకులు ప్రాంతంలో హ్యూం ఇద్దరు మనుషులను పట్టుకున్నాడు. సోదా చేయగా వారి చేతి సంచిలో ఒక ఉత్తరం దొరికింది. అది శ్రీరామరాజు తనకు తోడుగా యుద్ధంలో చేరమని తునిలో వున్న స్నేహితుడు పేరిచర్ల సూర్య నారాయణ రాజుకు రాసింది. లేఖ ఇలా సాగుతుంది.

"సోదరా! యుద్ధం మొదలిడితిని. మన సేన నాలుగు చోట్ల బ్రిటిషు సేనను ఓడించినది. దైవానుగ్రహం వల్ల మనకు విజయం లభించినది. మన పూర్వ స్నేహమును పురస్కరించుకొని వెంటనే నా దగ్గరకు రమ్మని నీకు నా ప్రార్థన. బ్రిటిషు వారికి మరణం ఆసన్నమైనది. ప్రతి వాడు వాని కాలము, కర్మము పరిపక్వము చెందగానే ఎక్కడున్నను మరణించ వలసినదే. ఎంత పోషించినను ఈ శరీరము ఎప్పడో ఒకప్పడు నశించవలసినదే. మనుష్యులు శాశ్వతము కాదు. కీర్త్యపకీర్తులు, పుణ్యపాపములు మాత్రము శాశ్వతములు. యుద్ధము చేయుట క్షత్రియ ధర్మము. ...... యుద్ధము అనివార్యమని తలచి యుద్ధము ప్రారంభించితిని. ఈ యుత్తరమందగానే నీవు నా యొద్దకు వచ్చెదవనియే గాఢముగా నమ్ముచున్నాను. నీతో మరి ఎవ్వరైనను వచ్చునో దయయుంచి తీసుకొని రమ్ము. నీవు ఒకసారి ఇక్కడకు వచ్చి నా సన్నాహములు, ఏర్పాట్లు చూచిన తరువాత నీకు నచ్చకపోయినచో నీవు తిరిగి వెళ్లిపోవచ్చును. మన పూర్వ స్నేహమును జ్ఞప్తికి తెచ్చుకొనవలెను. పేకేటి వారబ్బాయి కూడ వున్నచో తప్పక తీసుకొని రమ్ము. మిత్రులందరికి నా అభినందనములు.

ఇట్లు

శ్రీ అల్లూరి శ్రీరామరాజు.



అల్లూరి పోస్టల్ స్టాంప్

సీతారామరాజును చంపిన స్థలం (కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం)లో అల్లూరి విగ్రహం



అల్లూరిని పట్టిస్తే రూ.10వేలు ఇస్తామంటూ నాటి ప్రకటన



సీతారామరాజు భౌతిక కాయం

◆ కథ

కదలిక

సింహప్రసాద్

సిపిఎం జాతీయ మహా సభల సందర్భంగా ప్రథమ బహుమతి పొందిన కథ

బజారు ఉలిక్కిపడింది. రోడ్లమీద, దుకాణాల్లో ఉన్న జనమంతా తలలు తిప్పి చూశారు.

వరుసగా బడిపిల్లలు ప్లకార్డులు ధరించి రెండు వరసల్లో వస్తున్నారు. తొమ్మిదేళ్ళ నుంచి పదహారేళ్ళ దాకా ఉన్నారు పిల్లలు. బాలలే కాదు బాలికలూపెద్ద సంఖ్యలో ఉన్నారు.

సుమారు రెండువందల పైచిలుకు బాల బాలికలు లాగి విడిచిన బాణాల్లా ఉత్సాహంతో కదను తొక్కుతున్నారు.వారు ధరించిన అట్టలపై రాసిన రాతలు చూచి 'ఔరా' అనుకోకుండా ఉండలేకపోయారు జనం.

'విద్య మా హక్కు' , ' మేం చదువుకుంటాం', ' మాకు టీచర్లు కావాలి'

"బాగానే ఉంది. వీళ్ళూ రోడ్డెక్కేశారు" నినాదాలు చూసి వ్యాఖ్యానించారొకరు. "పాపం వీళ్ళంతా ప్రభుత్వ హైస్కూలు స్టూడెంట్సండీ. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అయిదారు కిలో మీటర్లు నడిచీ, సైకిళ్ళ మీదా వస్తూంటారు. అంతా పేద సాదల పిల్లలే. వీళ్ళనీ వీళ్ళ చదువుల్నీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిజంగా దారుణమే" అన్నారింకొకరు. "మేస్టార్లకి జీతాల లెక్కలూ ప్రైవేట్లూ సైడు బిజినెస్సులూ కావాలి గాని చదువులక్కర్లేదు. ఒక్కరూ టైముకు రారు. వచ్చినా తిన్నగా చెప్పరు. వాళ్ళ పిల్లల్ని మాత్రం ప్రైవేటు స్కూళ్ళలో ఎంచక్కా చదివిస్తుంటారు" అక్కసుగా అంది ఒకావిడ.

"వాళ్ళనేవిట్లే గవర్నమెంటు ఉద్యోగులంతా అలాగే ఉన్నారు. జనం కోసం మేం అనుకోవట్లేదు, మాకోసం జనం అనుకుంటున్నారు"

"ఢిల్లీ జనంలోలా మనలోనూ మార్పు రావాలండీ. అప్పుడే పాలకుల్లో, ఉద్యోగుల్లో జవాబు దారీ తనం పెరుగుతుంది...."

"ప్చ్..... తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదుర్తాయి గాని ఈ ప్రభుత్వాలు మేల్కోవు. వీటివల్ల ప్రయోజనం ఓ పెద్ద సున్న"

రకరకాల వ్యాఖ్యలు, విమర్శలు, అభిప్రాయాలు యథేచ్ఛగా విహరిస్తోంటే బజారు మధ్యలోని ముఖ్య రహదారి మీద విద్యార్థులు ఆగారు. ట్రాఫిక్ ఆగిపోయింది.

ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు పరుగునొచ్చారు.

"ఇక్కడాగారేంటి? వెళ్ళండెళ్ళండి " ఒకడు లాఠీ ఝుళిపించాడు.

రెండోవాడు "బళ్ళో బుద్ధిగా చదువుకోక నడిరోడ్డు మీద ఈ న్యూసెన్సేవిటి" కోప్పడ్డాడు.

"చదువు కోసమే వచ్చాం. చదివించేవారు కావాలని వచ్చాం" పదిహేనేళ్ళ మల్లిక ముందుకొచ్చి అంది.

"ఓహో. నువ్వు ఈ పిల్లకాయల లీడరువా! ఆడపిల్లవైనా వీళ్ళని బాగానే నడిపిస్తున్నావు గాని మీ గోస ఇక్కడ కాదు అధికార్ల దగ్గర చెప్పుకోండి. ఊ..... కదలండి...."

"మా ఇబ్బందులు జనానికి తెలియాలి" అందా అమ్మాయి ఎలాంటి తొట్రుబాటు లేకుండా. వెంటనే పిల్లలంతా నినాదాలందుకున్నారు.

"250 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లా? సిగ్గు సిగ్గు!"

"చదువు మా హక్కు. దాన్ని మాకు ఇప్పించండి"

"వెంటనే టీచర్ల ఖాళీలు నింపాలి!" "కాగితాల మీద విద్యాహక్కు ఇస్తే చాలదు, ఉపాధ్యాయుల్ని ఇవ్వండి" పది నిమిషాల పాటు నినదించారు. పత్రికా విలేఖర్లొచ్చి వార్త రాసుకున్నారు. ఊరేగింపు ఫోటో తీసుకున్నారు.

"వీళ్ళ వాదన కరక్టే. చదివించే వాళ్ళ కోసం చదువుకునే వాళ్ళు రోడ్డెక్కాల్సిరావడం బాధా కరమే" అన్నారొకరు బిగ్గరగా. అతడి మాటల్తో ఏకీభవిస్తూ తప్పట్లు కొట్టారు ఎంతో మంది.

పిమ్మట విద్యార్థులంతా ఎమ్‌డీఓ ఆఫీసుకెళ్ళి బైఠాయించారు. పిల్లజనాన్ని చూసి కంగారుపడ్డారు యమ్మీవో రాజారావు. ఆయన

ప్రస్తుతం ఇన్చార్జి ఎమ్‌డీవో కూడానూ. ఆయనింకో ఎనిమిది నెలల్లో రిటైర్ కాబోతున్నారు. ఈలోగా ఎలాంటి గొడవలూ జరక్కుండా పూర్తి పెన్షన్‌తో ప్రశాంతంగా రిటైరై పోవాలని ఆయన తాపత్రయం.

"ఏమయ్యా అసిస్టెంటూ ఏంటి వాళ్ళ గోల?"

"జెడ్పీస్కూల్లో శాంక్షన్డ్ పోస్టులు పన్నెండు. ఉన్నది ముగ్గురు. గత మూడేళ్ళ నుంచీ ఇదే పరిస్థితండి. టెన్త్‌లో సున్నా రిజల్ట్స్ వస్తున్నా... రిజల్ట్స్ టైములో తప్పు మళ్ళీ ఆ స్కూలు ఊసు ఎత్తిన పాపాన పోరెవరూ...."

"పైవాళ్ళివ్వందే మధ్యలో మనమేం చెయ్యగలం?" ఎదురు ప్రశ్నించారు రాజారావు.

"డీఈఓకీ జెడ్పీ ఛైర్మన్‌కీ కలెక్టరుకీ రాయటం వరకే మన పనండి..."

"అలా రాసేస్తామని చెప్పి పంపెయ్. మన మీద పడేకన్నా ఎమ్మెల్యే మీదో, మంత్రిగారి ఇంటి మీదో పడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని నచ్చ చెప్పవోయ్"

"ఆ ముక్క మీరే చెప్పాలని పట్టుబడుతున్నారు. మీడియా కూడా వచ్చేసిందండి. వాళ్ళంతా మన వాళ్ళే. అయినా అప్పుడప్పుడూ తోక లేపుతుంటారు. అవాకులు చవాకులూ రాసేస్తే మింగుడు పడటం కష్టం....."

'ఏడుకొండల వాడా! ఈ గొడవలేవీ చిలికి చిలికి గాలివానై నా కొంప మీద పడకుండా చూడు తండ్రీ. ఇంకో 250 రోజుల పాటు చల్లగా చూస్తే చాలు హ్యాపీగా రిటైరైపోతాను' అని మనుస్సులోనే దణ్ణం పెట్టుకుని ఆఫీసు బయటికొచ్చారు. పిల్లల వాడిన మొహాలనీ ఆశగా అర్థింపుగా చూస్తోన్న వారి కళ్ళనీ చూసేసరికి రాజారావు గుండె పట్టేసింది.ఏసీ బస్సులో ఇంటర్నేషనల్ స్కూల్‌కి వెళ్ళి ఏసీ క్లాసురూంలో కూర్చుని చదువుకొనే మనవడు గుర్తొచ్చాడు. ఆయన నయనాలు చెమ్మగిల్లాయి. యమ్మీవో ప్రమోషన్ రాకముందు ఆయనా ఉపాధ్యాయుడే.

రాష్ట్రాన్ని సింగపూర్ని చేసేస్తాం. పాత భవనాలు కూల్చి ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తాం– అంటూ పెద్ద పెద్ద వాగ్దానాలు గుప్పించే నాయకులు, శాలువా కప్పిన ప్రతి సంస్థకీ సంఘానికీ కోట్లు కోట్లు ఇచ్చేస్తామని, అడగని వరాలు కూడా ఇచ్చేసే నాయకమ్మన్యులు జనం ప్రాథమికవసరాలని గుర్తించకపోవటం ఎంత సిగ్గు చేటు! ఎంత దౌర్భాగ్యం!

"పిల్లలూ! మీరిలా ర్యాలీ నిర్వహించకూడదు. మీ చదువు పాడవుతుంది. మీ భవిష్యత్తు పాడవుతుంది..."

"చదువు పాడయ్యిందనే వచ్చాం సార్..." మల్లిక ముందు కొచ్చి జవాబిచ్చింది..."

ఆమె వంక తేరిపారి చూశారు. పట్టుమని పదిహేనేళ్ళుండవ్. ఇంత మంది పిల్లల్ని కదిలించి ఒక్క తాటి మీద నడిపించుకొచ్చింది. ఆడపిల్లల్ని చదివించండి, బోల్డన్ని ఉచిత సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూంటుంది. అలాంటిది స్కూల్లో సౌకర్యాల లేమి గురించి ఒక ఆడపిల్ల ప్రభుత్వాన్ని నిలదీస్తోంది.

"మీ బాధ నేను అర్థం చేసుకోగలను. కాని పరిస్థితుల్ని మీరు అర్థం చేసుకోవాలి. ప్రభుత్వానికెన్నో సమస్యలుంటాయి. మీరే సర్దుకుపోవాలి. ఇంగ్లీషు టీచరు లేరనుకో..."

"నిజంగానే లేరండి..."

"అప్పుడేం చేయాలి? లెక్కల టీచర్తో నాలుగు ఇంగ్లీషు ముక్కలూ చెప్పించుకోవాలి.."

"లెక్కల టీచరూ లేరు సార్"ఒకబ్బాయి అరిచాడు.

"మరప్పుడు సైన్సు టీచర్ని రిక్వెస్ట్ చేసి...

"సైన్సు టీచర్ లేరు సార్ " కోరస్‌గా చెప్పారు విద్యార్థులు.

బుర్ర గోక్కున్నారు. "మరెవరున్నారు?"

" తెలుగు టీచర్, సోషల్ టీచర్, పీటీ సార్..."

ఒక్క క్షణం ఏం మాట్లాడాలో తోచలేదు."మీకు స్కూలుకి టీవీ ఇవ్వలేదూ? వీసీఆర్ ఇవ్వలేదూ? నిన్నగాక మొన్న కంప్యూటర్లు సప్లై చెయ్యలేదూ?"

"చేశార్సార్. టీవీ పాడయ్యింది. వీసీఆర్ ఎక్కడుందో తెలీదు. కంప్యూటర్లిచ్చారు గాని టీచర్నివ్వలేదు. అవి బూజు పట్టి ఓ మూలన పడి ఉన్నాయి. ఆడపిల్లలకు మరుగు దొడ్లు లేవు. మంచినీరు లేదు. ఇంకా చాలా లేవు సార్. అవన్నీ అడగడం లేదు. మాకు టీచర్ల నిచ్చి మాకు విద్య నేర్పించమని ప్రార్థిస్తున్నాం.." గద్గద స్వరంతో చెప్పి చేతులు జోడించింది మల్లిక. మిగతావాళ్ళూ చిట్టి పొట్టి చేతుల్తో దండాలు పెట్టారు. భగవంతుడి ముందు భక్తుల్లా నిలబడ్డారు.

రాజారావు కదలిపోయారు.

ప్రభుత్వం దగ్గర డబ్బులేక కాదు. చిత్తశుద్ధి లేదు. అంకిత భావం అసలేలేదు. అభివృద్ధి పనుల పేరిట ఎన్నెన్నో కోట్లు విడుదల చేస్తున్నారు! ఆ మధ్య తుఫానొస్తే పునర్నిర్మాణానికంటూ కోట్లు కోట్లు కేటాయించారు. కాని చేసింది తక్కువ బొక్కింది ఎక్కువ. అందులో తనకీ వాటా లేకపోలేదు. రేపు గోదావరి పుష్కరాలకి ఇవ్వబోయే వందల కోట్లలో

> **మల్లిక ఇంట్లో మాత్రం పెద్ద గొడవే జరిగింది.**
> **"మీ అమ్మాయి మా అమ్మాయినీ బజారుకి లాక్కెళ్ళింది. తగదునమ్మా అంటూ అందర్నీ వెంటేసుకుపోయింది. హవ్వ. నలుగురూ తప్పు పడుతున్నారు. కాస్త మందలించి అదుపులో పెట్టండి"అన్నారెమె తండ్రితో.ఆ మరు క్షణం కళ్ళు మూసుకుని మల్లిక మీద పడ్డాడాయన."మగరాయుడిలా నువ్వెందుకు ముందుండాలే? బోల్డు మంది మగ పిల్లలున్నారుగా. వాళ్ళు చూసుకుంటార్లే. వాళ్ళకి లేని దురద నీకెందుకు?**

సమస్యలున్నాయి. కాదనను. దానికోసం స్కూలు ఎగ్గొట్టి మీరిలా రాకూడదు. ఇలా ప్రదర్శన నిర్వహించకూడదు. మీ పెద్దవాళ్ళకు చెప్పి పిటీషన్లు పెట్టించాలి. ఇది పెద్దవాళ్ళు చూడాల్సిన పెద్ద విషయం..."

కొందరు ముందుకొచ్చి తమ తల్లిదండ్రులకి చదువు రాదని చెప్పారు.

"సరే సరే. సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారుగా. ఇక మేం పూనుకుంటాం. త్వరలోనే టీచర్లు వేసేట్టు చూస్తాం. మీరిహ స్కూలుకెళ్ళి బుద్ధిగా చదువుకోండి.."

"ఇంకో నాలుగు నెలల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షలొస్తాయండి. ఎప్పట్లోగా టీచర్లని పంపుతారో చెప్పండి సార్..." నిలదీసింది మల్లిక.

అవునవునంటూ తలలాడించారు పిల్లలు.

"కచ్చితంగా ఫలానా తారీఖు లోపల టీచర్లని అప్పాయింట్ చెయ్యగలమని చెప్పడం కుదర్దు. దీనికెన్నో అంచెలున్నాయి. ఇదో పరమ పద సోపాన క్రమం ...అయినా చేస్తాం. ఇది వరకెప్పుడో మీ ఎంత నొక్కేయొచ్చని అప్పుడే లెక్కలేసుకుంటున్నారు.

రాజకీయ నాయకులూ అధికార్లూ! ఈ విద్యార్థుల గురించి పట్టించుకుంటే ఏమైనా ఒరిగేట్టుంటే ఎప్పుడో గద్దలు వాలిపోయేవి!ప్చ్!

కాలం చెడిపోయింది!

చిన్నగా నిట్టూర్చి. "ఒక్క నెలలో ఇద్దరు ముగ్గురు టీచర్లనైనా వేయించేట్టు చూస్తాను" హామీఇచ్చారు.

విద్యార్థుల కళ్ళు మెరిశాయి. దేవుడు వరమిచ్చినట్టు పొంగిపోయారు.

"యమ్మీవోగారు జిందాబాద్" అని నినాదాలు చేసి వెళ్ళిపోయారు.

వాళ్ళెళ్ళాక "మనం ఏదో ఒకటి చెయ్యాలయ్యా" అన్నారు అసిస్టెంటుతో. తను పదవీ విరమణ చేసేలోపు ఇంచార్జి యమ్మీవోగా కొనసాగి, ఓ అయిదు లకారాలు వెనకేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్న ఆయన 'ఆ పసివాళ్ళకేదో చెయ్యాలి' అని మరో పని నిర్దేశించుకున్నారు.

వెంటనే అవసరమైన వివరాలతో ఫైలు

పంపారు. పిమ్మట రిమైండర్లూ వెళ్లాయి. డీఈవో ఆఫీసులోని సూపరిండెంటు నుంచి దేని గురించో ఫోన్ వస్తే ఆ సంగతి గుర్తు చేశారు.

"అదెక్కడ చిక్కుబడిందో మరి నా దగ్గరికి రాలేదు. వస్తే వెంటనే చూస్తాలే" అని చేతులు దులిపేసుకున్నాడయన.

స్థానిక రిపోర్టర్లు వార్తని ఫోటోల్నీ పత్రిక కార్యాలయానికి పంపేరు గాని వాళ్లు ఆ ఏరియా టాబ్లాయిడ్‌లో నాలుగు లైన్లు రాసి ఊరుకున్నారు. స్థానిక మంత్రిగారి విదేశీ పర్యటన గురించీ, క్రికెట్ నుంచి తప్పుకొంటున్న ఆ జిల్లా ఆటగాడి గురించీ, గోదావరి మీద షూటింగు జరుపుకుంటున్న సినిమా గురించీ రాయడానికీ పేపరంతా సరిపోయింది మరి!

మల్లిక ఇంట్లో మాత్రం పెద్ద గొడవే జరిగింది.

"మీ అమ్మాయి మా అమ్మాయినీ బజారుకి లాక్కెళ్ళింది. తగదునమ్మా అంటూ అందర్నీ వెంటేసుకుపోయింది. హవ్వ. నలుగురూ తప్పు పడుతున్నారు. కాస్త మందలించి అదుపులో పెట్టండి" అన్నారామె తండ్రితో.

ఆ మరు క్షణం కళ్ళు మూసుకుని మల్లిక మీద పడ్డాడాయన.

> **"మీ నాన్న మాటలు పట్టించుకోవద్దు. నువ్వు చేసిన పని చాలా మంచిది చిట్టి తల్లీ!..."**
> **"నాన్న..." "నువ్వు మగపిల్లాడి వయ్యుంటే నిన్ను భుజాల మీద కెక్కించుకుని తిప్పేవారు. ఆడపిల్లవవడంతో తాటాకులు కడతారేమోననిభయపడుతున్నారు.." "పనికి మంచీ చెడూ ఉంటాయి గాని ఆడామగా తేడాలుంటాయా అమ్మా?" "ఈ మగాళ్ల లోకంలో ఉంటాయమ్మా. నువ్వేం అధైర్యపడొద్దు. వెనుకడగు వేయొద్దు.**

"మగరాయుడిలా నువ్వెందుకు ముందుండాలే? బోల్డు మంది మగ పిల్లలున్నారుగా. వాళ్ళు చూసుకుంటార్లే. వాళ్ళకి లేని దురద నీకెందుకు? నువ్వు కుదురుగా ఉండేట్టయితేనే స్కూలుకు వెళ్ళు, లేకపోతే చదువు మాని ఇంట్లో కూర్చో. ఊళ్ళో వాళ్ళ చేత నేను నానా మాటలూ పడలేను" కరాఖండిగా చెప్పేశాడు తండ్రి.

"అది కాదు నాన్నా. మాకు టీచర్లు లేరు. చదువు సాగట్లేదు.ఎంత మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు...."

"అందుకని ఆడపిల్లవనీ మరో ఇంటికి మెట్టాల్సిన దానివనీ మర్చిపోయి రోడ్డెక్కాలా?"

"చదువుకి ఆడామగా ఏంటి నాన్నా. చదువుల తల్లి సరస్వతి ఆడదే కదా. అయినా మేమేం గొడవ చెయ్యలేదు. బుద్ధిగా యమ్డీవో ఆఫీసు కెళ్ళి మహజరు ఇచ్చామంతే"

"నువ్వేదో ఇంత కాగితం ఇచ్చినంత మాత్రాన వాళ్ళేదో చేసేస్తారంటావ్. ఇక్కడ కాసుల్తో తప్ప కాగితాలతో పనులు జరగవు. పగటి కలలు కనడం మాని బుద్ధిగా పడుండు. ఇంకోసారలా అందర్నీ పోగేశావంటే కాళ్ళిరగ్గొడతాను జాగ్రత్త"

హతాశురాలయ్యింది మల్లిక. తను చేసిందానికి తండ్రి మెచ్చుకుంటారనుకుంది గాని ఇలా హెచ్చరిస్తారని ఊహించలేదు. ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకుని చతికిలపడడం చూసి తల్లి జాలిపడింది. కూతురి పక్కన కూర్చుని తల నిమిరింది.

"మీ నాన్న మాటలు పట్టించుకోవద్దు. నువ్వు చేసిన పని చాలా మంచిది చిట్టి తల్లీ!..."

"నాన్న..."

"నువ్వు మగపిల్లాడి వయ్యుంటే నిన్ను భుజాల మీద కెక్కించుకుని తిప్పేవారు. ఆడపిల్లవవడంతో తాటాకులు కడతారేమోనని భయపడుతున్నారు.."

"పనికి మంచీ చెడూ ఉంటాయి గాని ఆడామగా తేడాలుంటాయా అమ్మా?"

"ఈ మగాళ్ళ లోకంలో ఉంటాయమ్మా. నువ్వేం అధైర్యపడొద్దు. వెనుకడగు వేయొద్దు. నాకు తెలుసు. నలుగురి కోసం నీలా అంతా నడుం కట్టలేరు. నువ్వు సాధిస్తావు తల్లీ..."తల్లి మాటలకు నవ్యోత్సాహం వచ్చింది మల్లికకి. రోజూ స్కూలుకి వెళ్ళీ వెళ్ళగానే ఇంచార్జి హెడ్మాస్టార్ని కలిసి "కొత్త ఉపాధ్యాయుల్ని నియమించారా సార్" అని వాకబు చేస్తోంది. మొదట 'రాలేదు' అన్నారు. తర్వాత్తర్వాత తల అడ్డంగా ఊపారు. ఈ మధ్య ఆమె కనిపించీ కనిపించగానే పెదవి విరుస్తున్నారు. యమ్మీవో ఇచ్చిన గడువు దాటి నాలుగు రోజులయ్యింది. పరిస్థితిలో మార్పు లేదు. విద్యార్థుల ఉత్సాహం నీరు కారిపోయింది.

స్తోమత గల వాళ్ళు ప్రైవేటు ట్యూషన్లు వెదుక్కోసాగారు. కొందర్నేమో చదువు మాని పనికెళ్ళమని వారి తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. తొమ్మిది, పది తరగతుల పిల్లల్ని సమావేశపర్చింది మల్లిక.

"మనం మళ్ళీ వెళ్ళి అడగాలి.. ఈసారి పనయ్యేదాకా అక్కడే బైఠాయిద్దాం..."

విద్యార్థులు కలవరపడ్డారు. విద్యార్థినులు సగం మంది "మా ఇంట్లో కోప్పడతారు. మేం రాము" అని మొహం మీదే చెప్పేశారు. "ఇది నా ఒక్క దాని సమస్య కాదు. మనందరి సమస్య. మన చదువు సమస్య. మన పరీక్షల సమస్య. మన భవిష్యత్తు సమస్య..."

"ఏమైనా అయితే గియితే పెద్దవాళ్ళ వల్లనే అవుద్దంట. పిల్లల వల్ల ఏమీ కాదన్నారు మా నాన్న" ఒకబ్బాయి అన్నాడు.

"ఏ పెద్దవాళ్ళ వల్ల పనవుద్దో కనుక్కో. వాళ్ళనే బతిమాలదాం"

ఆ కుర్రాడు తలూపాడు.

"నారాయణ తాత సమర యోధుడు. ఎనభై ఏళ్ళుపైనే ఉంటాయి. ఆయనంటే అందరికీ ఎంతో గౌరవం. అభిమానం.

మల్లిక కళ్ళు మెరిశాయి."ఇప్పుడెళ్ళి కలుద్దాం. వస్తారా?"

ఓ నలుగురు ముందుకు రాగా వాళ్ళతో సైకిళ్ళ మీద నారాయణ తాత ఇంటి కెళ్ళారు. విషయమంతా సావధానంగా విన్నారాయన. వారు చేస్తున్న కృషిని అభినందించారు.

"ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కూర్చోకుండా మీరంతా మీ పరిధిలో కృషి చేయడం బావుంది. మీ చైతన్యం నన్ను అబ్బురపరుస్తోంది. సమస్యల్ని ఏకరువు పెట్టే వాళ్ళే ఎక్కువ. వాటికి పరిష్కారం వెదకాలని ఆలోచించరు. నిద్రాణమై ఉన్న సమాజాన్ని కదిలించడానికి పెను నిద్ర వదిలించడానికి మీరంతా పూనుకోవడం చాలా ఆనందంగా ఉంది. పది అంతస్తుల భవనమైనా పునాది పటిష్టంగా ఉంటేనే పదికాలాల పాటు నిలబడుతుంది. పాఠశాల స్థాయి నుంచీ చదువు సక్రమంగా సాగితేనే మీ భవిష్యత్తు బాగుంటుంది. మీలాగానే ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ఇచ్చిన హక్కుల గురించి తెలుసుకోవాలి. అవి అమలు చేసేట్టు ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. వాళ్ళు తమ బాధ్యతల్ని గుర్తెరిగేలా చెయ్యాలి. అప్పుడే పాలకుల్లో మార్పు వస్తుంది. మీ వెంట మీ వెనుక నేనూ ఉంటాను. ఇవాళ మీది పీలగొంతే కావొచ్చు.రేపటికి శంఖనాదంగా మారితీరుతుంది.."

మల్లిక మిగతా పిల్లలూ పొంగిపోయారు "మీరు ముందుండి. మమ్మల్ని నడిపించండి తాతయ్యా"

"బాధ పడుతున్న వాళ్ళే ముందుండాలి. బాధితులే ముందడుగు వేయాలి. మీది సత్యాగ్రహం. ధర్మపోరాటం" అంటూ వీపు తట్టారు.మర్నాడు విద్యార్థులందర్నీ స్కూల్లోకి వెళ్ళనివ్వకుండా గేటు దగ్గరే ఆపేశారు మల్లిక తదితరులు.

"నిన్న మేం నారాయణ తాతని కలిశాం. మనం చేసింది రైటేనన్నారు. వెనకడుగు వేయొద్దన్నారు. మనకి సపోర్టుగా వస్తానన్నారు. మనం నిరాశపడొద్దు. టీచర్లని వేసే దాకా స్కూల్లో

అడుగు పెటొద్దు..."

మల్లిక మాటలకి భయపడ్డారు."హమ్మో-స్కూలు మానేస్తే టీచర్లు కొడతారు" అందో అమ్మాయి.

"ఎందుక్కొడతారు? మనమేమీ తప్పు పని చెయ్యట్లేదు. కావాలని స్కూలు ఎగ్గొట్టడం లేదు. స్కూలంటే దేవాలయమే. కాని మన ఈ దేవాలయంలో దేవుడు లేడు. దేవుణ్ణి ప్రతిష్ఠించమంటున్నామంతే. మనకి అండగా ఉండమని టీచర్లనీ కోరదాం..."

తప్పట్లు కొట్టారంతా. మల్లిక ఆధ్వర్యంలో ఒక బృందం ఇంచార్జి హెడ్మాస్టారునీ మిగతా ఇద్దరు టీచర్లనీ కలిశారు. సహకారం అర్థించారు. వాళ్ళు వెంటనే అంగీకరించారు.

"మన స్కూలుని జీరో పెర్సంటేజ్ స్కూల్ అని గేలి చేస్తున్నారు. అందుకు మాకు సిగ్గుగానే ఉంది. ఎస్సెస్సీలో అలాంటి రిజల్ట్స్ ఎందుకొస్తున్నాయని ఆలోచించడం లేదు. పట్టించుకోవటమూ లేదు. చదువు నేర్చుకోనేవారున్నా నేర్పేవారు లేకపోవడం చిత్రమైన పరిస్థితే. చదువంటే పరీక్షలూ, రిజల్ట్సూ సర్టిఫికేట్లూ మాత్రమే.కాదు. చదువంటే విజ్ఞానం. వికాసం భవిష్యత్తు మీ బంగారు భవిత మట్టి పాలవుతోంటే చూస్తూ కూర్చోవడం గురువు లక్షణం కాదు. మేం మీతో చేతులు కలుపుతాం. పదండి. మరుక్షణం స్కూలు గేటుకి తాళం పడింది. అంతా సుశిక్షిత సైనికుల్లా, రెండు బారులుగా నడుస్తూ ఊరేగింపు తీశారు.

"చదువు మా హక్కు. చదువు నేర్పించండి", 'స్కూలు ఉంది. విద్యార్థులున్నారు.ఉపాధ్యాయులు లేరు. సిగ్గు సిగ్గు!', 'మా భవిష్యత్తుని బలి తీసుకోవడం దుర్మార్గం. రాక్షసత్వం!' , 'ప్రభుత్వమూ ప్రజాప్రతినిధులూ కళ్ళు తెరవాలి", 'ప్రజలారా! మా భవితకు చేతులడ్డు పెట్టండి'

వినూత్న నినాదాలతో బజారు ప్రతిధ్వనించింది. జనం మళ్ళీ ఉలిక్కిపడ్డారు. 'పాపం వీళ్ళకింకా మాస్టార్లని వెయ్యలేదా' అనుకుని సానుభూతిగా చూశారు. నారాయణ తాత కర్ర సాయంతో నడుస్తూ వచ్చి కలిసే సరికి అందరి ఉత్సాహం ద్విగుణీకృతమైంది.

"ప్రైవేటు విద్యాలయాలకీ, విదేశీ విశ్వ విద్యాలయాలకీ భారీ రాయితీలిచ్చే ప్రభుత్వం పేద మధ్య తరగతి పిల్లలు చదివే గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్ని నిర్లక్ష్యం చెయ్యడం దారుణం. ఈ ఘోరాన్ని వేలెత్తి చూపడం సమస్య పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావడం మనందరి బాధ్యత" నారాయణ తాత ప్రసంగం పౌరుల్నీ ఉత్తేజ పరిచింది. కొందరొచ్చి కలిశారు. అంతా యమ్డీవో ఆఫీసుకెళ్ళారు.

బయటి నినాదాలు చెవినబడే సరికి లంచ్ చేస్తోన్న రాజారావుకి పొలమారింది.క్రితం సారి విద్యార్థులొచ్చి అడిగినప్పుడు ఆ వేడిలో ఏదేదో చేశారు. ఆ తర్వాత ఆ గొడవ మర్చిపోయారు. ఇంకో ఏడు నెలల్లో రిటైర్ కాబోతున్నారు. గనుక పెన్షన్ వెంటనే సెటిలవ్వడానిగ్గాను తను పని చేసిన అన్ని స్కూళ్ళనుంచీ ఆఫీసుల్నుంచీ సర్వీసు రికార్డులు తెప్పించుకునే పనిలో పడ్డారు. రిటైరైతే తన పని తన ఆఫీసు వాళ్ళే పట్టించుకోరని ఆయన నిశ్చితాభిప్రాయం!

అసిస్టెంటుని పిలిచి ఆ ఫైలు ఏమయిందో కనుక్కోమని ఆదేశించారు. ఆఫీసు బయట విద్యార్థులంతా రోడ్డు మీదే బైఠాయించారు. ఎండ మండిపోతోంది. నేల కాలిపోతోంది. అయిదు నిమిషాలకే పిల్లలు కందిపోయారు. కన్నీటి పర్యంతమయ్యారు. నినాదాల జోరు తగ్గింది. గొంతెండి పోతోంది. సమీప వ్యాపారస్తులు మంచినీళ్ళూ మజ్జిగా తెచ్చిచ్చారు.

ఆఫీసులో తొంగి చూడటమే తప్ప ఉద్యోగులెవరూ బయటికి రాలేదు. పిల్లల పరిస్థితి చూసి కదలిపోయారు నారాయణ తాత. వాళ్ళందర్నీ చెట్టు నీడలో కూర్చోమన్నారు.టౌన్లోని ప్రతిపక్ష నాయకులూ వివిధ యూనియన్ల నాయకులూ వచ్చి తమ సంఘీభావం తెలిపారు. ఉపన్యాసాలిచ్చారు. ప్రభు త్వాన్ని దుయ్యబట్టారు. రాజారావు అన్ని ఆఫీసు లకీ ఫోన్ చేశాడు. ఏ ఆఫీసులోను సదరు ఫైలు ఆచూకీ తెలీలేదు.దాంతో విద్యార్థులకు మొఖం చూపించ లేక లోపలే ఉండిపోయారు. చీకటి పడింది. ఆ మర్నాడు. తిన్నగా ఇక్కడికే వచ్చెయ్యాలని చెప్పుకుని వెళ్ళిపోయారు. చాలా మంది పిల్లల తల్లిదండ్రులూ వారి వెంట వారికి మద్దతుగా వచ్చారు. వారిలో మల్లిక తండ్రీ ఉన్నాడు.

కాస్సేపు నినాదాలిచ్చారు. పిమ్మట తొమ్మిది పదో తరగతి విద్యార్థులు చిన్న క్లాసుల వాళ్ళకి చెట్టు కిందే పాఠాలు చెప్పడం మొదలెట్టారు. యమ్డీవో ఆఫీసు ఆవరణం అంతా గురుకులంగా మారిపోయింది. ప్రింటు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చి వాలిపోయే సరికి రాజారావు కంగారు పడ్డారు.

టీచర్ల అప్పాయింట్మెంటుకి సంబంధించిన ఫైలు కదిలిందనీ ఇక స్కూలుకెళ్ళిపోమనీ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారాయన.

"స్కూలు కెళ్ళినా చేసేదేం లేదు కదా సార్. అది తేలే వరకూ ఇక్కడే ఉంటాం" అని మల్లిక జవాబిచ్చేసరికి కంగుతిన్నారు. ఇదేదో కొంప కూల్చే వ్యవహారమేనని భయపడ్డారు. పిల్లలకీ పెద్దలకీ నచ్చ చెప్పాలని ఆయనా ఆఫీసోద్యోగులూ ప్రయత్నించారు గాని ఎవరూ మెత్తబడలేదు.

ఈ లోగా వార్త టీవీలో ప్రసారమయ్యే సరికి ఆ సంఘటన గురించి రాష్ట్రమంతా తెలిసిపోయింది. టీచర్లు లేని ప్రభుత్వ స్కూళ్ళలోనూ అలజడి మొదలైంది.తాము కూడా ధర్నాలు చెయ్యడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. ప్రముఖులూ ప్రతి పక్షాలూ మద్దతిస్తామంటూ ముందుకొస్తున్నాయి. అదో ఉద్యమంగా రూపుదిద్దుకోసాగింది. ప్రాథమికావసరాలను గాలికొదిలి ప్రభుత్వం ఆకాశానికి నిచ్చెన్లు వేస్తోందంటూ విమర్శలు చెలరేగాయి.అవి జడివానగా మారి. ఉక్కిరి బిక్కిరి చేశాయి. దాంతో ఆగమేఘాల మీద ఉత్తర్వు లొచ్చేశాయి. పరమానంద భరితులయ్యారు రాజా రావు. ఫ్యాక్స్ ఉత్తర్వుని విద్యార్థులకు చూపుతూ అన్నారు. "మీరంతా గెలిచినందుకు అభినందనలు. ఇద్దరు టీచర్లను మీ స్కూలుకి వేశారు. వారు రేపే వచ్చి జాయినవుతారు. అయిదుగురు విద్యావాలంటీర్లను నియమించడానికీ అనుమతిచ్చారు. రేపుటెల్లుండ్లో నియమించేస్తాను. ఇక మీ ధర్నా విరమించెయ్యండి" విద్యార్థులంతా హర్షధ్వానాలు చేశారు. చిందులేశారు.

నారాయణ తాత ఇన్ని చాక్లెట్లు కొని తెచ్చి ఒకటి మొదటగా మల్లిక నోట్లో పెట్టి ఆశీర్వదిస్తూ అన్నారు.

"ఇవాల్టి నుంచి ఆడవాళ్ళనెవరైనా అబల అంటే వూరుకునేది లేదు. ఆమె శక్తి యొక్క మరో రూపం! మారు రూపం!" అంతా మల్లికని అభినందనల్తో ముంచెత్తుతోంటే ఆమె వంక గర్వంగా చూశాడామె తండ్రి.

అంతటితో ఆగలేదు, మల్లిక తండ్రినని గుండెలు పొంగించి మరీ చెప్పాడందరికీ. ✦

చుక్కలు కలుపుదాం

తేడాలు గమనించండి

కొండల మధ్య, సెలయేటిలాగా ప్రవహిస్తున్న నీరు, చల్లని వాతావరణం, చక్కగా ఉంది కదా ఈ చిన్న పల్లెటూరు. అయితే ఇందులో 6 తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి.



ఎవరి ఇల్లు ఏది!

ఈ చిత్రంలో నాలుగు జంతువులున్నాయి కదా. ఇంతకీ దేని నివాసం ఏదో గుర్తించండి.



నేస్తం కనిపించాడా?

ఈయనగారి మిత్రుడు అడవిలో తప్పిపోయాడు. ఎంత వెతికినా కనిపించలేదట. మీకేమైనా కనిపించాడేమో చెప్పండి.

ఆ రెండు ఏవి?

ఈ చిత్రంలో ఓ విచిత్ర జీవి ఉంది. అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించి చెప్పండి.

బొమ్మల డాక్టర్

మీకు బొమ్మలంటే చాలా ఇష్టం కదా. అవునూ... అన్నిట్లోకి ఏ బొమ్మంటే ఇష్టం? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కొంచెం కష్టమే. అయినా కాసేపు ఆలోచిస్తే మీకే జవాబు తెల్సిపోతుంది. ఒకవేళ ఆ బొమ్మ కింద పడి విరిగిపోతే! పాడైపోతే! బోలెడంత ఏడుపొచ్చేస్తుంది. అందుకు కారణమైన వాళ్లని కొట్టాలనిపిస్తుంది. అంత బాధలోనూ...మీ చిట్టి బుర్రలో ఒక ఐడియా కూడా వచ్చేస్తుంది. 'ఈ బొమ్మని ఎవరైనా బాగు చేస్తే ఎంత బావుంటుంది! అని. ఆ... అలాంటి అంకుల్ ఒడిషాలో వున్నాడంటే నమ్ముతారా. ఆయన పేరు ధ్యానేంద్ర కర్. పాడైపోయిన ఎలాంటి బొమ్మనైనా బాగు చేసేస్తాడంట. రిమోట్‌తో నడిచే కార్లు, హెలికాప్టర్లు, ఏరోప్లేన్లు, ఫ్యాన్సీ లైట్లు మొదలుకొని బేబీ సైకిళ్ల వరకు ఏది తీసుకెళ్లినా...అది ఎక్కడ పాడైందో చెప్పేయడమే కాదు! బాగు చేసేస్తాడు కూడా. కాకపోతే అది రిపేర్ చేయడానికి అయిన టైము, రిపేర్ చేసిన పార్టుని బట్టి డబ్బులు తీసుకుంటాడు. సుమారుగా చెప్పాలంటే 50 రూపాయల నుంచి 3 వేల రూపాయల వరకు వసూలు చేస్తాడు. ఓసారి ఒక అంకుల్ భువనేశ్వర్ నుంచి జీప్సీ కారు బొమ్మను తీసుకొచ్చాడట. బాగవుతుందో లేదోనని ఆయన ఒకటే కంగారు పడిపోయారు. ధ్యానేంద్ర నాలుగు గంటలసేపు కష్టపడి దాన్ని పరుగులు తీయించేశాడు. ఇక చూస్కోండి ఆ అంకుల్ చిన్నపిల్లాడిలా సంతోషపడిపోయాడట. జీప్సీ బాగైనందుకు. పాడైపోయిన బొమ్మలు బాగు చేయించుకునేందుకు...కటక్, భువనేశ్వర్ నుంచే కాక... రాష్ట్రం నలుమూలల నుంచి వస్తుంటారు. అందుకే ఈయనకు 'టాయ్ డాక్టర్' అని పేరు కూడా వచ్చేసింది.

కొత్త పుస్తకాలు

భౌతికవాద అధ్యయనానికి ...

డా॥కె.బి కృష్ణ పూర్తి పేరు కాట్రగడ్డ బాలకృష్ణ. గుంటూరు జిల్లా ఇంటూరులో 1906లో జన్మించారు. యు.ఎస్.ఎలో ఉన్నత విద్య లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్సు హార్వార్డ్ విశ్వవిద్యాలయంలోనూ అధ్యయనం చేశారు. భారతదేశ చరిత్ర, తత్వ శాస్త్రం, అర్ధశాస్త్రం, రాజకీయ శాస్త్రం, సామ్రాజ్య వాదం, విప్లవాలు, జాతీయ విముక్తి పోరాటాలు, వీరు శోధించిన అంశాల్లో ఉన్నాయి. బ్రిటిష్ జైళ్ళలో మగ్గుతూ 42 సంవత్సరాల వయస్సుకే (1948లో) తుది శ్వాస విడిచిన మార్క్సిస్ట్ మేధావి డా॥ కాట్రగడ్డ బాలకృష్ణ. కుల వ్యవస్థను వ్యతిరేకించిన ఉద్యమాల చరిత్ర ఆధిపత్య పోరులో బ్రాహ్మణ, బౌద్ధ సిద్ధాంతాలతో ఒక వైపు తలపడుతూనే పక్క పక్కనే నిలదొక్కుకున్న తీరును ఈ గ్రంథ వ్యాసాలు బహిర్గతం చేశాయి. ఈ పుస్తకంలో తొలి అధ్యాయంలో ఉత్తర భారతదేశంలోని బౌద్ధ రచయితల గురించి రాశారు. శాంతి దేవుడు, అశ్వ ఘోషుడు, ఆర్య దేవుడు, లలిత విస్తార, ఆర్య శూరుడు, బుద్ధ ఘోషుడు గురించి రాశారు.



డా॥కె.బి.కృష్ణ రచనలు,
తెలుగు అనువాదం : రావెల సాంబశివరావు,
పేజీలు:330, వెల:రూ. 240/-,
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్.

తమిళ ప్రాచీన మహాకావ్య రచయిత యువరాజు ఇలంగో అడిగల్ రచన "శిలప్పాదికారమ్" – మరో తమిళ మహాకావ్యం "మణి మేఖలై" సృజించిన సిత్తలై సత్తిన్ – ఈయన యువరాజు ఇలంగో మిత్రుడు– కనిష్కుడు రమారమి క్రీ.శ 120 లో సింహాసనాన్ని అధిష్టించి ఉండవచ్చు. భారత దేశ చరిత్రలో కనిష్కుని మరణానికి గుప్త సామ్రాజ్య ఆవిష్కరణానికి మధ్య గల కాలం అత్యంత అంధకార యుగాల్లో ఒకటి. బృహత్ భారతదేశంలో బౌద్ధ రాజకీయ సిద్ధాంతం పాశ్చాత్యులపై బౌద్ధ ప్రభావం సమకాలీన రాజకీయ ఆలోచన రీతులు ఐరోపా మధ్య ప్రాచీన చైనా, రెండవ భాగంలో ప్రాచీన భారతదేశంలో రాచరికపు సిద్ధాంతాలు, మూడవ భాగంలో హిందూ భౌతిక వాదులు కొందరు బృహస్పతి, చార్వాకుడు (క్రీ.పూ1200–2000) కపిలుడు తొలి సంఖ్య దర్శన పరిచయం (క్రీ.పూ 700–600) ఉపనిషదానంతర భౌతిక వాద ఆలోచనాపరులు (క్రీ.పూ 1000–600) భగవద్గీతలో భౌతిక వాద అంశాలు (క్రీ.పూ 500) ప్రబోధ చంద్రోదయంలో భౌతికవాద అంశాలు (క్రీ.శ 700) భౌతికవాది గా వేమన (క్రీ.శ 500) అంశాలు పాఠకుల్ని చైతన్య పరుస్తాయి. ఇవి మే 1932లో రాసినవి. హెగెల్, మార్క్స్, రాబర్ట్ ఓవెన్ లాంటి వారి భావాల్ని బాలకృష్ణ చర్చించారు. రాచరికపు సిద్ధాంతాలు, హిందూ భౌతికవాద అధ్యయనాలకు చక్కటి కరదీపిక.

అరచేతిలో.. అద్భుత ప్రపంచం

నవచేతన విజ్ఞాన సమితి ముద్రణాలయం వారి నూతన ప్రచురణగా ఈ రసాయన శాస్త్ర గ్రంథం ప్రచురించారు. ముఖ్యంగా రసాయన శాస్త్రమునకు మూల స్తంభాలు: త్రిమూర్తులు వంటి జాన్ డాల్టన్, రాబర్ట్ బున్‌సెన్, డిమిత్రి మెండవిన్‌ల జీవన విధానం, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు వారి కృషి ఈ పుస్తకంలో తెలుసుకోగలరు.

మనం తినే తిండి, పీల్చే గాలి, తాగే నీరు, ధరించే వస్త్రము, అవయవాలకు ధరించే రక్షలు... ఒకటేమిటి ఇవన్నీ రసాయన శాస్త్ర సంబంధాలు. అలాగే మన నిత్య జీవక్రియలైన శ్వాస క్రియ, పోషకాహార స్వీకరణ, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, విసర్జన క్రియలు వంటివి జీవ రసాయన క్రియలు, ప్రతి క్రియా నిర్వహణ, క్రియా సంఘటనలు, రసాయన నిర్మితాలు, ఇలాంటివెన్నో చర్చించారు ఈ పుస్తకంలో. దాదాపు 10 విభాగాలుగా ఈ గ్రంథ రచన ప్రణాళికాబద్ధంగా కూర్చి రాశారు. రచయిత "రసాయన శాస్త్రాన్ని" ఓ అద్భుత ప్రపంచంగా తొలి అధ్యయనంలో పరిచయం చేస్తారు. 2వ భాగంలో "గ్రీకు నేపథ్యం", 3వ భాగంలో "రసాయన శాస్త్రం–సార్వత్రిక గుర్తులు", 4వ భాగంలో "వంటగదిలో రసాయనం". 5వ భాగంలో "విటమిన్లు... జనాభాకు మంచి ఆహారం." కృత్రిమ వస్త్రాలు.! రసాయనిక శాస్త్రవేత్తలైన జాన్ డాల్టన్, రాబర్ట్ విల్ హెల్మ్ బున్‌సెన్, డిమిత్రి ఇవానోవిచ్ మెండవిన్ గురించి తెలియజేస్తూ చివరి అధ్యాయంలో 'రసాయన శాస్త్ర అభివృద్ధి' గురించి రాశారు. మనిషి సామాజికంగా మారింది 20 వేల సంవత్సరాల కిందటనే సంగతితోపాటు, అధునాతన మానవ జనాభా ఉనికి, పృథ్వి వయస్సు, విశ్వం వయస్సు వంటి వాటిని అధునాతన వైజ్ఞానిక అభివృద్ధితో నిర్ణయించిన కాలవ్యవధి వివరాలు పాఠకుల్లో ఆసక్తి కల్గిస్తుంది. 1772 సంవత్సరంలో "రసాయన శాస్త్రం"తో పోల్చుకున్నట్లయితే భౌతిక శాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. హెన్రికా వెండిష్ – భూభారాన్ని లెక్క కట్టారు. క్రీ.పూ 8000 నుండి1600 మధ్య కాలంలో టైగ్రిస్ మరియు యుఫ్రేట్స్ నదుల ఒడ్డున, తొలినాళ్ళ నాగరికత "సుమేరియన్ నాగరికత" విస్తరించింది. ఇలా రసాయన శాస్త్రజ్ఞులు, విశేషాలు ప్రయోగాలు, పదార్థాలు, డా॥ ఆళ్ళ అప్పారావు వివరించిన తీరు బాగుంది. విద్యార్థులకు సైన్స్ అధ్యయనం చేసేవారికి చక్కటి కరదీపిక.



రసాయనశాస్త్రం-ఓ అద్భుత ప్రపంచం,
రచన:డా॥ఆళ్ళ అప్పారావు,
పేజీలు:108/-
వెల: రూ 70/-
ప్రతులకు: నవచేతన బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్.

-తంగిరాల చక్రవర్తి

కెవిన్ కార్టర్

కరకైన చిత్రం

ఏ ప్రశ్నతో మొదలైందో, అదే ప్రశ్నతో అంతమైపోయింది కెవిన్ కార్టర్ జీవితం. మానవత్వం జాడ కోసం కెమెరా పట్టి వెతికిన తన జీవితం, ప్రపంచానికి ఓ కరకైన ముఖచిత్రాన్ని అంకితమిచ్చి అర్ధంతరంగా అన్యాయమైపోయింది. దారుణ వాస్తవాల్ని నిస్సహాయంగా బంధించలేక, అబద్ధపు బతుకులో బందీకాలేక పని ముగించుకుంది.

తన తల్లిదండ్రులను వర్ణ వివక్షపై ప్రశ్నించడంతో మొదలైంది కెవిన్ కార్టర్ జీవితం. దక్షిణాఫ్రికాలోని జొహాన్స్ బర్గ్‌లో 1960 సెప్టెంబర్ 13న పుట్టి, అక్కడే పెరిగిన కార్టర్ శ్వేతజాత్యంహంకార దమనకాండకు ప్రత్యక్షసాక్షి. చిన్నతనంలో, సాటి నీగ్రో పిల్లాడిని చావబాదుతున్న పోలీసుల్ని ఆపమని తల్లిదండ్రుల్ని వేడుకున్నా పట్టించుకోకపోవడంతో ఆయన ఆలోచనలో పడ్డాడు. హైస్కూలు వరకు చదివిన కార్టర్ ఫార్మసిస్ట్‌గా పనిచేశాడు. ఆర్మీలో తర్వాత ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసిన ఆయనకు వాటి నిరంకుశత్వం నచ్చలేదు. ఓ సారి మెస్ వెయిటరైన ఓ నల్ల జాతీయుణ్ని తోటి తెల్లోళ్లు అవహేళన చేస్తే అడ్డుకున్నాడు. వారి చేత చావుదెబ్బలు తిన్నాడు. అక్కడి నుంచి తప్పించుకుని డీజే డేవిడ్‌గా మారాడు. 1983లో ప్రిటోరియాలోని చర్చి వీధిలో జరిగిన ఓ బాంబుదాడి అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ ఘటనలను ప్రపంచానికి చాటేందుకు ప్రెస్ ఫొటోగ్రాఫర్‌గా మారాలని నిశ్చయించుకున్నాడు. క్రీడ ఛాయాచిత్రకారుడిగా అనుభవం సంపాదించిన తర్వాత జొహాన్స్‌బర్గ్ స్టార్ అనే పత్రికలో చేరి జాతివిద్వేష దాడుల్ని వెలుగులోకి తెచ్చాడు. నీగ్రోలు శత్రువుల్ని అతిక్రూరంగా చంపే 'నెక్ లేసింగ్' అనే శిక్షను కెమెరాతో బంధించాడు. బ్యాంగ్ బ్యాంగ్ ఫొటోగ్రఫీ క్లబ్‌ను మరో నలుగురు మిత్రులతో కలిసి స్థాపించి యుద్ధ బీభత్సాన్ని చిత్రీకరించాడు.

1993లో సూడాన్‌ను కరవు కబళిస్తోంది. ఆ పరిస్థితులను చిత్రించేందుకు కార్టర్ బృందం అక్కడకు చేరుకుంది. ఐక్యరాజ్యసమితి ఆపరేషన్ లైఫ్‌లైన్‌లో భాగంగా తిండి సరఫరా చేసే విహంగంలో ఓ షెల్టర్ జోన్ దగ్గర దిగింది. అరగంట లోపల పని పూర్తి చేసుకోవాలని, వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని ఎవరినీ ముట్టుకోవద్దని ముందే కార్టర్ బృందాన్ని ఆదేశించారు. కార్టర్ అలా దిగాడో లేదో అక్కడి గుడిసెల్లోంచి అన్నార్తులు ఎగబడ్డారు. అందరూ అతి బక్కపల్చగా జీవచ్ఛవాల్లా ఉన్నారు. ఎండుటాకుల్లా ఉన్న పిల్లల్నీ మోసే ఓపిక లేని కొందరు తల్లులు వాళ్లను కింద వదిలి తిండి ప్యాకెట్ల కోసం వెళ్లారు. ఓ చిన్న పిల్ల ఓపిక తెచ్చుకుని కదిలే ప్రయత్నం చేస్తుండగా ఓ రాబందు ఆ పాప వెనుక వాలింది. ఆ దృశ్యాల్ని చూసి కార్టర్ చలించిపోయాడు. ఆ పాపను, రాబందును పదిమీటర్ల దూరం నుంచి ఫొటో తీస్తూనే దాన్ని తరిమాడు. కళ్లవెంట ధారగా నీళ్లు ఉబికి వస్తున్నా తమాయించుకుని వృత్తి ధర్మాన్ని పాటించాడు. ఆ అరగంటలో తన కళ్లెదుటే 5 ప్రాణాలు ఆకలితో బలైపోయాయని తన ఆవేదనను మిత్రులతో పంచుకున్నాడు. న్యూయార్క్ టైమ్స్‌లో మార్చి 26న ప్రచురితమైన ఆ ఫొటోగ్రాఫ్‌కు పులిట్జర్ బహుమతి లభించింది.

ఘటన నేపథ్యం తెలియని రంధ్రాన్వేషకుల విమర్శల జడిలోనూ కార్టర్ తడిశాడు. "ఫొటోలోని ఆ రాబందు విమర్శకులు, పసిపాప నా తండ్రి." అని కూతురు తన తోడు నిలిచినా కార్టర్ దాన్ని తట్టుకోలేకపోయాడు. దీనికి తోడు తన వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లు, పేదరికం, ఆకలి మంట, ఎటూ చూసినా కానవచ్చే అకృత్యాలు, మానవత్వం లేని మనుషులు, బాంబు దాడుల్లో మిత్రుల మరణం ఆయనకు జీవితాన్ని ప్రశ్నగా మార్చాయి. 1994 జూలై 27న తనకిష్టమైన చిన్ననాటి ఆటస్థలం పార్క్‌మోర్ ఫీల్డ్ అండ్ సెంటర్ వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మానవత్వపు జాడ అర్థం కాక, అకృత్యాలను చూడలేకే ఈ పని చేసినట్టుగా లేఖలో రాశాడు. అతడి వ్యథాభరిత జీవితంపై 'బ్యాంగ్ బ్యాంగ్ క్లబ్' అనే సినిమా తీశారు. ఆయన పేరు మీద విషాద గీతాలు, విప్లవ సాహిత్యాలూ వచ్చాయి.

●



బౌద్ధ విద్యాలయం

నలువైపులా

పచ్చటి కొండలు... వాటిని తాకుతూ నల్లటి మబ్బులు...చల్లని పవనాలు... తెల్లని హిమ పరదాలు... ఆ మధ్యన ఎర్రటి చెక్క ఇళ్లు. గుంపులు గుంపులుగా సంచరించే బౌద్ధ సన్యాసులు. చైనాలోని 'లారంగ్ గర్ బుద్ధిస్టు అకాడమీ'లోనిదీ దృశ్యం. సిచువాన్ ప్రావిన్సులో వుందీ టిబెటెన్ బుద్దిస్టు విద్యాలయం. ఇక్కడ చదువుకోవడానికి సింగపూర్, మలేషియా, తైవాన్, హాంగ్‌కాంగ్, టిబెట్, మంగోలియా నుంచి వస్తుంటారు.

ఇక్కడ సుమారుగా 40, 000 మంది బౌద్ధ సన్యాసులు నివాసముంటారు. వీరికోసం నిర్మించినవే వేలాది చెక్క ఇళ్లు. అన్నీ ఎరుపు రంగులోనే వుంటాయి. బౌద్ధ సన్యాసుల సైతం సుమారుగా అదే రంగు దుస్తులు వేసుకుంటారు. దూరం నుంచి చూస్తే చిన్న చిన్న గూళ్ల మాదిరిగా ఇళ్లన్నీ ఒకేలా వుంటాయి. ప్రతి ఇంట్లోను ఒకటి నుంచి మూడు గదులుంటాయి. టాయిలెట్లు మాత్రం వుండవు. బయట నిర్మించిన ఉమ్మడి మరుగుదొడ్లనే వాడుకోవాలి. టీవీలపై నిషేధం వుంది. ఐఫోన్లను మాత్రం భేషుగ్గా వాడుకోవచ్చు. బౌద్ధ గురువులు తాము బోధించే కళాశాలలకు దగ్గరలోనే నివాసం వుంటారు. మరణానంతరం శరీరం ఒక ఖాళీ పాత్ర వంటిదని, దాన్ని భద్రపరచాల్సిన అవసరం లేదని, దాన్నలా ప్రకృతికి వదిలేయడమే ఉత్తమమని వారి నమ్మకం. స్థానికంగా కిరోసిన్, కట్టెల కొరత వుంటుంది. మృతదేహాలను పూడ్చిపెడదామా అంటే... కొండరాళ్లను తవ్వడం అంత సులభం కాదు. అందుకే వాటిని పశుపక్ష్యాదులకు ఆహారంగా వదిలేస్తుంటారు. ఆఖరి వరకు పరోపకారంలోనే సంతోషముందన్నది వారి విశ్వాసం.

●